ప్రజాశక్తి

శనివారం 19 నవంబర్ 2022 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



గుండ్లకమ్మ ప్రాజెక్టును సందర్శిస్తున్న టిడిపి నాయకులు

గుండ్లకమ్మ ప్రాజెక్టుకు మూడు గేట్లే పెట్టలేదు

మూడు రాజధానులు ఎలా కడతారు?

- టిడిపి నాయకుల విమర్శ
- ప్రాజెక్టు సందర్శన

ప్రజాశక్తి - మద్దిపాడు

గుండ్లకమ్మ ప్రాజెక్టులో మూడు గేట్లు పెట్టలేని వారు మూడు రాజధానులు ఎలా కడతారని టిడిపి బృందం ప్రశ్నించారు. మండల పరిధిలోని కందుల ఓబులరెడి జలాశయాన్ని టిడిపి బృందం శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు జలాశయం యొక్క గేట్లను పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ప్రాజెక్టులో మూడు టిఎంసిలు నీరు నిల్వ ఉంచాల్సి ఉండగా,. పస్తుతం 1.5 టిఎంసిల నీరు మాత్రమే ఉందన్నారు. రైతులు మిర్చి, పొగాకు, మొక్కజొన్న పంటలు వేసి ఉన్నారని, వాటికి 15రోజులలో నీరు పెట్టాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ పాటికే పంటల సాగు కోసం రైతులు లక్షలాది రూపాయలు వెచ్చించారని తెలిపారు. ప్రాజెక్టు గేట్లు గాలికి వదిలేసి ఇతరులపై నిందలు మోపడం చేతగాని ప్రభుత్వానికి నిదర్శన మన్నారు. 15 రోజులలో గేట్లు ఏర్పాటు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్ రావు, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, కొండపి ఎమ్మెల్యే డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి, మాజీ ఎమ్మెల్యేలు విజయ్‌కుమార్, కందుల నారాయణరెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు మండవ జయంత్ బాబు, ప్రధాన కార్యదర్శిరామలింగం, మండల రైతు అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, సిహెచ్. రఘు తదితరులు పాల్గొన్నారు.

పాలనపై పట్టు ఏదీ?

- అధికారులకూ,ప్రజా ప్రతినిధులకూ మధ్య సమన్వయలోపం
- క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలియని అయోమయ పరిస్థితి
- శాఖలపై పట్టులేని ప్రజాప్రతినిధులు
- సమీక్షలు లేకపోవడం కారణం



జడ్‌పి సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

పాలనలో ఏం జరుగుతోంది? క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో కూడా తెలియని పరిస్థితిలో ప్రజా ప్రతినిధులు ఉన్నారు. వారికి నివేదికలపైనా పట్టు కనిపించని దైన్యం.. వెరసి జిల్లా ప్రజాప్రతినిధులకు పాలనపై పట్టులేదని తేట తెల్లమవు తోంది.అధికార యంత్రాంగానికి, ప్రజా ప్రతినిధులకూ సమన్వయ లోపం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. మొన్న జరిగిన జడ్‌పి సమావేశంలో ప్రజా పతినిధుల ప్రశ్నలు.. అధికారుల సమాధానాలే ఇందుకు అద్దంపడుతున్నాయి. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉంటున్న ఎమ్మెల్యేలకు ఇతర శాఖల్లో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి వచ్చింది. శాఖలపై కూడా వారికి పట్టు ఉన్నట్లుగా కనిపించడం లేదు. జడ్‌పి నివేదికల్లో ఉన్న అంశాలపైనా సందేహాలు వ్యక్తం చేయడమే సమన్వయ లోపం ఎలా ఉందో తెలుస్తోంది. నెలల తరబడి సమీక్షలు ఉండటం లేదు. శాఖల్లో ఏం జరుగుతుందో కూడా పాలకపక్ష ఎమ్మెల్యేలకు తెలియడంలేదని పిస్తోంది .సచివాలయ వ్యవస్థ వచ్చాక అన్ని పథకాలు వాటి ద్వారానే అమలు జరుగుతున్నాయి. దిగువస్థాయిలో సమీక్షలు లేవు.పథకాలపై చర్చ అంతకన్నా లేదు. లబ్ధిదారులు కూడా నేరుగా సచివాలయాలను సందర్శిస్తున్నారు. అక్కడ వారి సమస్యలకు పరిష్కారాలు దొరు కుతున్నాయ నేదీ స్పష్టత లేదు. మరోవైపు స్పందనకు వేలాది మంది వస్తున్నారు. అర్జీలు తీసుకుని నేరుగా కలెక్టర్ వద్దకు వస్తున్నారు. పతకాలు అందడం లేదని అర్జీలు ఇస్తున్నారు. పాలనలో సమన్వయ లోపంతోపాటు క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందనేదీ స్పష్టత లేదు. గుండ్లకమ్మ ప్రాజెక్టుపై చర్చ సాగిన తీరు చూస్తే ప్రజాప్రతినిధులకు పాలనపై పట్టు ఎలా ఉందో విధిత మవుతోంది. గుండ్లకమ్మ గేట్లు ఇప్పటికే పూర్తిచేయలేదు. దీనిపై పాలకపక్ష ఎమ్మెల్యేలే అయోమయంగా మాట్లాడారు. అధికారుల నిర్లక్ష్యం వల్లనే నష్టం జరుగుతుందని ఆరోపించారు. ఇందుకు ఎవరు బాధ్యులు? వారిని పాలించేదెవరు? సమస్యలు ఉత్పన్నమైనపుడు వాటిని ఎలా ఎదుర్కోవాలి ? నిధులు ఇతర పాలనా పరమైన అవరోధాలు ఏమిటి? అనే అంశాలపై దృష్టిసారించాల్సిన ప్రజా ప్రతినిధులు ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. అధికారులపై ఆరోపణలు చేస్తే ఫలితం లేదని గుర్తించడం లేదు. నిధుల కోసం పంపిన ప్రతిపాదనలపై దృష్టిలేదు. గుండ్ల కమ్మ ప్రాజెక్టు విషయంలోనే

2లో

జగనన్న కాలనీల్లో సౌకర్యాలు కల్పించాలి

కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

జగనన్న కాలనీలల్లో సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. గహనిర్మాణాల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ జగనన్న కాలనీల లబ్ధిదారులు నిర్మించు కుంటున్న గహాలకు యుద్ధ ప్రాతిపదికన తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లాలో 25 లేఅవుట్లలలో గహ నిర్మాణాలు 50 శాతానికి చేరినట్లు తెలిపారు. మిగిలిన పనులు వేగంగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బాపట్లలో 30,525 పక్కాగహాలు మంజూరు చేశామన్నారు. పునాది స్థాయిలో 5,366 గహాలు, రూఫ్ స్థాయికి 1,272 చేరాయన్నారు. శ్లాబు వేసిన గహాలు 1,938 ఉన్నాయని తెలిపారు. 4,362 గహాల నిర్మాణం పూర్తయిందన్నారు. మిగిలినవి పునాదిస్థాయికి దిగువనే ఉన్నాయన్నారు. 25 లేఅవుట్లలలో 4,223 ప్లాట్లు మంజూరు కాగా 3,580 గహాల నిర్మాణం వేగంగా జరుగుతుందన్నారు. ఈ లేఅవుట్లలలో 80.95 శాతం పునాదిస్థాయికి పైగా చేరుకున్నాయని కలెక్టర్ వివరించారు. జిల్లాలో వేగంగా గహనిర్మాణాలు జరుగుతున్న 25 లేఅవుట్లలకు తాగునీటి సరఫరా చేయాలన్నారు. ఆ కాలనీలలో వీధి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆ గహాలకు తక్షణమే విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలన్నారు. లబ్దిదారులకు అవసరమైన ఇటుకలు తక్కువ ధరకు లభించేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. గహనిర్మాణాలకు సెంట్రింగ్ కొరత ఉందన్నారు. దాన్ని అరికట్టడానికి సెంట్రింగ్ యూనిట్లు స్థాపించాలని కలెక్టర్ సూచించారు. అందుకోసం బడుగు వికాసం కింద డిఆర్‌డిఎ ద్వారా రుణ సదుపాయం కల్పించాలన్నారు. లబ్ధిదారులను ప్రోత్సహించి గహ నిర్మాణాలలో పురోగతికి సహకరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో గహనిర్మాణ శాఖ కార్యనిర్వాహక సంచాలకులు ఎన్. రామచంద్రా రెడ్డి, గహనిర్మాణ శాఖ పీడీ ప్రసాద్, డిఆర్‌డిఎ పీడీ అర్జునరావు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి

భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలి

రోడ్లు భవనాలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్

ప్రజాశక్తి-సిఎస్‌పురం



అటవీభూములను పరిశీలిస్తున్న పిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్, కలెక్టర్

బెంగళూరు- కడప- విజయవాడ గ్రీన్ ఫీల్డ్ హైవే (544-జి) నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అధికారులకు సూచించారు. హైవే నిర్మాణ పనులకు పరిశీలించేందుకు శుక్రవారం ఆయన సిఎస్‌పురం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన హైవే నిర్మాణం జరిగే మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో ఉన్న భైరవకొండ రిజర్వు అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడానికి అవసరమైన అటవీశాఖ అనుమతులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతులు త్వరగా వచ్చేలా తగిన ప్రతిపాదనలు రూపొందించి, చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. యాక్సెస్ కంట్రోల్ ద్వారా విజయవాడ-బెంగళూరు మధ్య ప్రయాణ కాలాన్ని 13 గంటల నుంచి ఏడు గంటలకు తగ్గేలా అందుబాటులోకి ఈ హైవేను ప్రభుత్వం తీసుకురాబోతుందన్నారు. ఈ హైవేకు సంబంధించిన విద్యుదీకరణ పనుల అంచనాలు, అవసరమైన చోట కాలువపై వంతెనల నిర్మాణాలకు అంచనాలు త్వరగా రూపొందించేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ దిశగా తీసుకుంటున్న చర్యలను ప్రవీణ్ ప్రకాష్‌కు కలెక్టర్ దినేష్ కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, కనిగిరి ఆర్‌డిఓ సందీప్‌కుమార్, భూసేకరణ ప్రత్యేక అధికారి విశ్వేశ్వరరావు, ప్రాజెక్టు కన్సల్టెన్సీ ఆర్వీ అసోసియేట్స్ ప్రతినిధులు, జిల్లా అటవీ అధికారి నాగభూషణ్, రోడ్లు భవనాలశాఖ ఎస్ఇ విజయరత్నం, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులు, తహశీల్దారు బాలకేశవులు పాల్గొన్నారు.

పాలనపై పట్టు ఏదీ?

(మొదటి పేజీ తరువాయి)

ఇది తేటతెల్లమైంది. రెండు నెలలైనా ఇంత వరకూ దానిపై సమీక్ష లేదు. జడ్‌పిలో చర్చకు తెచ్చారు. అనేక అంశాలు చర్చకు వచ్చినపుడు అధికారులకూ, ప్రజాప్రతినిధులకూ మధ్య ఉన్న దూరం ఎలా ఉందో తెలుస్తుంది. వెలుగొండ నిర్వాసితులకు పరిహారం ఇంత వరకూ అందలేదు. అందుకు సుమారు రూ.1,400 కోట్ల అవసరం ఉంది. నిర్వాసితులు పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. పునరావాసం పూర్తికాలేదు. వచ్చేఏడాది సెప్టెంబరునాటికి ప్రాజెక్టును ప్రారంభించాలని నిర్ణయించారు. ప్రకటన కూడా చేశారు. దీనిపై ఇప్పటికీ స్పష్టత లేదు. అవసరమైన నిధుల కోసం ప్రజాప్రతినిధులు గానీ, మంత్రిగానీ చేపట్టిన చర్యలు ఏమిటనేదీ ప్రశ్నార్థకంగానే ఉంది. ఇరిగేషన్‌శాఖపై ప్రజాప్రతినిధులు ఉన్నతస్థాయి సమీక్ష పెడితే ఇలాంటివాటిపై చర్చ జరుగుతుంది. ఆ దిశగా చర్యలు లేవు. ఇంకా జగనన్న ఇళ్లు ముందుకు సాగడంలేదు. వాటిపైఇప్పటి వరకూ సమీక్ష లేదు.'' కేవలం అధికారులు నలుగురు కూర్చుని మాట్లాడుకోవడం జరుగుతోంది. కలెక్టర్ శాఖలపై సమీక్ష పెట్టి ఆదేశాలు ఇస్తున్నారు. పూర్తిచేయాలని ఒత్తిడి పెంచారు. దిగువస్థాయిలో ఎలాంటి అవరోధాలు న్నాయనే దానిపై సమీక్ష లేదు.ఎందుకు లక్ష్యాలు నెరవేరడం లేదనేదానిపై లోతుగా చర్చల్లేవు. ఇసుక సమస్య తీవ్రంగా ఉంది. అంతా తెలిసినా దీనిపై సిఎం దృష్టికి తీసుకుపోవాలనే ఆలోచన ప్రజాప్రతినిధుల్లో కనిపించడం లేదు. శాఖల నుంచి ప్రభుత్వానికి నివేదికలు వెళ్తితే వాటిని నెలలు తరబడి పట్టించుకోవడంలేదు. వాటికి పాలనాపరమైన మంజూరుతోపాటు నిధులు తెచ్చుకోవాల్సి ఉంది. ఆర్థికశాఖ వద్ద కూడా క్లియరెన్సులు లేక అనేక పనులు ఆగిపోయాయి. నెలలు తరబడి చెరువులకు పడిన గండ్లు కూడా పూడ్చలేదని దిగువస్థాయి ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. అసలు అక్కడ వైఫల్యాలు ఎందుకు జరుగుతున్నాయనేదీ తెలియడం లేదు. నూతన విద్యావిధానం వల్ల పాఠశాలలు మూతపడ్డాయి. వాటినీ పట్టించుకోలేదు. ఇరిగేషన్ ప్రాజెక్టులతోపాటు తాగునీటి పథకాల పనులు ముందుకు సాగడంలేదు. రహదారుల పరిస్థితి ఇదే. ఇలా చెప్పుకుంటూపోతే అన్నిశాఖల్లోనూ ఇదే పరిస్థితి. నిధులు లేక పనులు చేపట్టడం లేదనే చెబుతున్నారు. వాటిపై పాలకపక్ష ప్రజాప్రతినిధులు దృష్టి సారించడంలేదు. ఎప్పుడో జరిగే సమావేశాల్లోనే చర్చకు వస్తాయి. తర్వాత వాటిని పర్యవేక్షించే వాళ్ల కరువవుతున్నారు. జిల్లాలో పాలనపై ప్రజాప్రతినిధులకు పట్టు లేదని తెలుస్తోంది. ఇప్పటికైనా కీలకశాఖలపై సమీక్షలు పెంచాలి.ప్రతాప్రతినిధులతో వీటిని ఏర్పాటు చేస్తే క్షేత్రస్థాయి సమస్యలపై చర్చకు అవకాశం ఉంటుంది.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-పిట్టలవాని పాలెం

పిట్టలవానిపాలెం శాఖా గ్రంథాలయంలో శుక్రవారం 55వ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మోర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్, వక్తృత్వం, పోటీలు నిర్వహించారు. ఎంపీపీ స్కూల్ (గాంధీ బొమ్మ) విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, డ్రాయింగ్ పోటీ, పద్యాల పోటీ, పాటల పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు పి శాంతకుమారి, ఎంపీపీ స్కూల్ హెచ్ఎం నిర్మల, శ్రీనివాస్‌రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టి అంజలి సూచించారు. ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ శాఖల ఆధ్వర్యంలో ఇంకొల్లు రోటరీ గంగ ఆవరణలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. రక్త హీనత ఉన్నవారికి ఉచితంగా మందులు ఇస్తామని తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్లలో పౌష్టికాహారం అందిస్తున్నామని సిహెచ్ఓ బివి కోటేశ్వరరావు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, పిహెచ్ఎన్ సహస్ర, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చీరాల

పట్టణంలోని 8వ వార్డు వాడరేవు రోడ్డులోని కోర్టు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఫెన్సింగ్ పనులను శాసనసభ్యులు కరణం బలరాం కృష్ణమూర్తి శుక్రవారం పరిశీలించారు. రూ.5 లక్షల వ్యయంతో చేపట్టిన ఫెన్సింగ్, గ్రీనరీ పనులను ఆయన పరిశీలించారు. గ్రీనరీ వలన ఆ ప్రాంతం ఆహ్లాదకరంగా ఉంటుందని ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం వలన పశువులు లోకి రాకుండా భద్రతగా ఉంటాయని ఆయన అన్నారు. మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ గ్రీనరీని సంరక్షించాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసరావు, కమిషనర్ ఏసయ్య తదితరులు ఉన్నారు.

కమిషనర్‌ది నిర్లక్ష్య వైఖరి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల మున్సిపాలిటీలో ఇంటింటికీ తిరిగి చెత్త సేకరణ చేసే మున్సిపల్ క్లాప్ డ్రైవర్స్ పట్ల బాపట్ల మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్య వైఖరి కార్మికుల మనో భావాలు దెబ్బతీసేలా ఉండటాన్ని సిఐటియు బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ ఖండించారు. శుక్రవారం క్లాప్ డ్రైవర్స్ సమస్యలపై కమిషనర్‌కు సిఐటియు నాయకత్వంలో కార్మికులు వినతిపత్రం సమర్పించారు. గత మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వట్లేదని, కనీస వేతనం అమలు చేయట్లేదని తెలిపారు. కమిషనర్ సమాధానమిస్తూ మీరు ఏజెన్సీకి సంబంధించి వాళ్లని, మునిసిపాలిటీకి ఎటువంటి సంబంధం లేదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. కార్మికులు నిత్యం మున్సిపాలిటీలో ప్రతి ఇంటికి చెత్త సేకరణ చేసి బాపట్ల పట్టణం పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్న డ్రైవర్స్ పట్ల ఈ విధంగా మాట్లాడటం సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు. మూడు నెలలుగా జీతాలు లేక ఇబ్బంది పడుతున్న మున్సిపల్ క్లాప్ డ్రైవర్స్‌కి వెంటనే జీతాలు ఇప్పించాలని కోరారు. రెడ్డి ఎంటర్‌ప్రైజెస్ ఏజెన్సీ వారితో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే కాలంలో బాపట్లలోని అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని ఈ సమస్యపై ఆందోళన చేయాల్సి ఉంటుందని చెప్పి హెచ్చరించారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి: తహశీల్దారు

ప్రజాశక్తి-చెరుకుపల్లి

రికార్డులను సక్రమంగా నిర్వహించకపోతే తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ టి ప్రశాంతి అన్నారు. గురువారం మండల పరిధిలోని తుమ్మలపాలెం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలను, సచివాలయాన్ని ఆమె పరిశీలించి తనిఖీ చేశారు. సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని, వాటిని సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆమె తెలిపారు. సచివాలయాల్లో రికార్డులను, అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు అందజేస్తున్న పదార్థాలను ఆమె పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, ఏదైనా నాణ్యత లోపించిన ఆహారం సరఫరా జరిగినట్లయితే వెనక్కి పంపించి మరలా తెప్పించాలని ఆమె పేర్కొన్నారు.

ఆరుంబాకలో 'గడప గడపకూ'

ప్రజాశక్తి-చెరుకుపల్లి

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆరుంబాక పంచాయతీ పరిధిలోని పొదిలి వారి పాలెం, పులిగడ్డ వారి పాలెం గ్రామాలలో శుక్రవారం నాలుగో రోజు నిర్వహించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు పాల్గొని ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామస్తులు కోరగా వాటిని వెంటనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్, జడ్పిటిసి మర్రివాడ వెంకట పావని, గ్రామ సర్పంచి కామినేని కోటేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు రావూరి సునీత శివ నాగేశ్వరరావు, నాయకులు అధికారులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

నిజాంపట్నం మండలం అడవులదీవి గ్రామానికి చెందిన ఏమినేని బిందు నాగశ్రీ అనే 9 సంవత్సరాల చిన్నారికి కాలేయ మార్పిడి చికిత్స అవసరం రావడంతో మోపిదేవి సహాయంతో మంజూరైన పది లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధిత చిన్నారికి చెక్కును అందజేశారు.

నాడు నేడు పనులను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సంచాలకులు బి రవి ప్రకాష్‌రెడ్డి బాపట్ల జిల్లా సహాయ సంచాలకులు జి అర్జున శుక్రవారం బాపట్ల ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాల జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న నాడు నేడు పనులను పరిశీలించి, పనుల నాణ్యత విషయంలో పలు సూచనలు చేశారు. విద్యార్థులతో మమేకమై వారితో కలసి భోజనం చేశారు. ఆహార నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ విద్యాసంస్థను డిగ్రీ కళాశాలగా అప్‌డేట్ చేసేందుకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. ఇక్కడ క్రీడల అభివృద్ధికి మౌలిక వసతులను కల్పించవలసిన అవసరాన్ని తెల్పి, విద్యార్థులందరికీ స్పోర్ట్స్ కిట్స్ అందించబోతున్నట్లు ప్రకటించారు. బధిర విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేసేందుకు మార్గదర్శకాలు నిర్దేశించి, స్ఫూర్తిని రగిలించినందుకు ప్రిన్సిపాల్ బి అరుణ, ఉపాధ్యాయులు, సిబ్బంది, సంచాలకుల వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సృజన సాహిత్య సభ

ప్రజాశక్తి-అద్దంకి

బాపట్ల జిల్లా అద్దంకిలోని ప్రకాశం బాలుర ఉన్నత పాఠశాల వెనుక వైపు ఉన్న రామ సుశీల నిలయంలో సృజన సాహిత్య సభ శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ప్రకాశం జిల్లా పూర్వపు కలెక్టర్ దాసరి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా స్వర్ణోత్సవ సంచికను, బాపట్ల జిల్లా గీతాన్ని విశ్రాంత ఐఎఎస్ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా చారిత్రక నేపథ్యాన్ని, సాంస్కృతిక వైభవాన్ని, జనజీవనాన్ని, కవులను, కళాకారులను, జిల్లా ఏర్పడిన తర్వాత అభివృద్ధిని చక్కగా శ్రీరామ చంద్రమూర్తి వివరించారని పేర్కొన్నారు. శ్రీరామచంద్రమూర్తి బాపట్ల జిల్లా ఏర్పడిన తర్వాత తొలుతగా జిల్లా ప్రాముఖ్యతను గూర్చి రాసిన గీతాన్ని బాపట్ల జిల్లా కలెక్టర్ జిల్లా గీతంగా ప్రకటించాలని కోరారు. గుండ్లకమ్మ నది పరీవాహక ప్రాంతంలోని గ్రామాల ఐదవై ఏళ్ల క్రితం పరిస్థితి, నేటి పరిస్థితి గూర్చి ఈ మైత్రి సదస్సులో చర్చించారు. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యాన జరుగుతున్న పరిశోధనలో భాగంగా గుండ్లకమ్మ ప్రాంతంలో పరిఢవిల్లిన నాగరికత, జనజీవన విధానం గూర్చి నేటి అభివృద్ధి గూర్చి ఒక మైత్రీ సమావేశం జరిగింది. ప్రకాశం, బాపట్ల జిల్లాల చరిత్ర గుండ్లకమ్మ నదితో ముడివడిందని, తెలుగుభాషకు ఎర్రన చేసిన సేవలు, ప్రోలయ వేమారెడ్డి పరిపాలన విధానాలను నేటి గుండ్లకమ్మ ప్రాంతం ప్రతిబింబించిందని వక్తలు పేర్కొన్నారు. వ్యవసాయం వదులుకుని నేడు రియల్ ఎస్టేట్ రంగంలోకి రైతులు ఆకర్షించబడటం దురదష్టకరమని అన్నారు. సాహిత్యపరంగా, కళలపరంగా గుండ్లకమ్మ ప్రాంతం అగ్రగామిగా నిలిచిందని అన్నారు. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజి ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యాన జరుగుతున్న పరిశోధన. తెలుగుభాషకు ఒనమాలు దిద్దబెట్టిన భూమిగానూ, పద్యాన్ని రక్షించిన భూమి గానూ అద్దంకిని వివరించారు. డాక్టర్ యు దేవపాలన, అన్నమనేని వెంకటరావు, చుండూరి మురళీ సుధాకరరావు, వీరవల్లి రుద్రయ్య, కాటూరి నరసయ్య, సందిరెడ్డి శ్రీనివాసరాలు, లక్కరాజు చంద్రశేఖర్, కె నాగయ్య, మలాది శ్రీనివాసరావు, నర్రా శ్రీలక్ష్మి, చిన్ని మురళీకృష్ణ, చెన్నుపాటి రామాంజనేయులు, టి శ్రీనివాసరావు, మారం కోటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యయే జార్జి విద్యాసంస్థల లక్ష్యం: మంత్రి

ప్రజాశక్తి-మార్కాపురం



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సురేష్

పశ్చిమ ప్రకాశంలో నిరుద్యోగ సమస్య పారదోలేందుకు భావి తరాలకు నైపుణ్యం ఉన్న విద్య అందించాలనేదే జార్జి విద్యాసంస్థల లక్ష్యమని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. జార్జి కళాశాల నూతన ఐటిఐ కళాశాల భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ సమస్య పశ్చిమ ప్రకాశంలో అధికంగా ఉందని, ఉన్న ప్రాంతంలోనే ఉద్యోగాలు సంపాదించాలంటే స్కిల్, సాంకేతిక కోర్సులు అవసరమన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారు ఉన్నత విద్యకు వెళ్లలేకపోతే అటువంటి వారికి ఐటిఐ లాంటి కోర్సు దోహదపడుతుందని పేర్కొన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కే నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ఇక్కడ ఒక కొత్త సాంకేతిక విద్యా కళాశాల ఏర్పాటు కావటం సంతోషదాయకం అన్నారు. జార్జి కళాశాలల కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల మంజూరైన 5 ఐటిఐ కళాశాలల్లో అత్యున్నత ప్రమాణాలు ఉన్న వాటిలో మార్కాపురం లోని జార్జి ఐటిఐ కళాశాల ఒకటి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాల మురళీకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుశీల పిచ్చయ్య, కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్ రాజబాబు, డీన్ ఎం మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.1.50 కోట్లకు వ్యాపారి ఎగనామం

వాచ్‌మన్‌ని కూడా వదిలిపెట్టని వైనం ● లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించిన బాధితులు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

పేరుకు అతనో సంఘ సేవకుడు. ప్రతి ఒక్కరితో వినమ్రంగా వ్యవహరిస్తాడు. పేదలకు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తాడు. కోవిడ్ సమయంలో అనాథలకు, దాతల సహకారంతో అన్నదానం నిర్వహిస్తాడు. బిజెపి నాయకుడిగా, మార్టూరు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ.. పలు వర్గాల వారితో నమ్మకంగా ఉంటూ ఆ నమ్మకమే పెట్టుబడిగా వారి వద్ద నుంచి లక్షల రూపాయలు అప్పుగా తీసుకొని వాటిని చెల్లించకుండా కాశీకి వెళుతున్నామంటూ రాత్రికి రాత్రి మూటా ముల్లె సర్దుకొని కుటుంబంతో సహా ఓ వ్యాపారి పరారైన ఘటన మండల కేంద్రం మార్టూరులో శుక్రవారం వెలుగు చూసింది. వ్యాపార వర్గాల్లో కలకలం రేపిన ఈ ఘటనపై బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు సిద్దాపురం గ్రామానికి చెందిన గుడూరు వెంకట నాగరాజు సుమారు 12 ఏళ్ల కిందట మార్టూరు చేరుకొని స్థానికంగా ఉన్న కొణిదెన రోడ్డులో సాయి శ్రీనివాస టవర్స్ అపార్టుమెంట్‌లో ప్లాట్ కొనుగోలు చేసి అందులో నివాసం ఉంటూ లారీ ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం ప్రారంభించాడు. స్థానిక వ్యాపారులు, అపార్టుమెంట్‌లో నివాసం ఉండే వారితో పరిచయం పెంచుకొని పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ అందరి దగ్గర నమ్మకం చూరగొన్నాడు. ఈ నేపథ్యంలో స్థానిక ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా వెంకటనాగరాజుని ఇటీవల ఎన్నుకున్నారు. బిజెపి తరపున మార్టూరు మండలంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ..


వెంకటనాగరాజు (ఫైల్)

పలువురి వద్ద గత కొద్ది సంవత్సరాలుగా పెద్ద మొత్తంలో నగదు అప్పుగా తీసుకొని కొంతమందికి మాత్రం వడ్డీ చెల్లిస్తూ కాలం గడుపుతున్నాడు. ఈ క్రమంలో నాలుగు రోజుల కిందట కుటుంబంతో కాశీ యాత్రకు వెళుతున్నామంటూ అపార్టుమెంట్ వాసులను నమ్మించి భారీ లగేజీతో వెంకట నాగరాజు మార్టూరు నుంచి ఉడాయించాడు. అప్పులు ఇచ్చిన వారు ఫోన్ చేస్తుంటే స్విచాఫ్ అని రావడంతో వెంకట నాగరాజుకి అప్పులిచ్చిన బాధితులంతా ఒక్కసారిగా ఉలిక్కిపడి తాము మోసపోయామని గ్రహించి అతని కోసం వెతుకులాట ప్రారంభించారు. ఎవరికీ అతని ఆచూకీ లభించకపోవడంతో లబోదిబోమంటూ మార్టూరు పోలీసులను శుక్రవారం ఆశ్రయించారు. రాజుగారిపాలెం గ్రామానికి చెందిన వ్యాపారికి సుమారు రూ.లక్షలు, స్థానిక స్వీట్ షాప్ యజమానికి రూ.3 లక్షలు, ఇతరులకు రూ.15 లక్షలు, మొత్తంగా షుమారు రూ.1.50 కోట్లు పైగా వసూలు చేసి పరారయినట్లు బాధితులు వాపోతున్నారు. ఒంగోలుకు చెందిన మార్గదర్శి చిట్‌ఫండ్‌లో రూ.20 లక్షలు, రూ.25 లక్షల చీటి పాటలకు మరి కొంతమంది చేత షూరిటీ సంతకాలు చేయించడంతో వారు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. చివరకు ఇతను నివాసం ఉండే అపార్ట్ మెంట్ వాచ్ మెన్ వద్ద కూతురు పెళ్లి కోసం దాచి పెట్టుకున్న రూ.4 లక్షల నగదును నాలుగు సంవత్సరాలు కిందట అప్పుగా తీసుకొని గట్టిగా అడగటంతో 2021 జనవరిలో నోటు రాసి ఇచ్చాడని, ఇప్పుడు వెంకట నాగరాజు ఉడాయించడంతో తమ కూతురికి పెళ్లి ఎలా చేయాలంటూ వాచ్‌మాన్ దంపతులు కన్నీటి పర్యంతమయ్యారు. గతంలో ఇతను నివాసం ఉండే సిద్దాపురం గ్రామంలో కూడా ఇదే విధంగా అక్కడి స్థానికుల వద్ద రూ.25 లక్షలు పైగా అప్పులు తీసుకుని ఎగనామం పెట్టి మార్టూరు ప్రాంతానికి వచ్చి సెటిల్ అయినట్లు సమాచారం.. పోలీసులు వెంకటనాగరాజు ఆచూకీ కనిపెట్టి తమకు న్యాయం చేయాలంటూ బాధితులు కోరుతున్నారు.

మహిళ హత్య వెనుక అన్నీ అనుమానాలే..

నాలుగు బృందాలతో పోలీసుల వేట

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలోని హనుమాన్ నగర్‌కు పులిబండ్ల నారాయణమ్మ అనే వృద్ధురాలు గురువారం రాత్రి హత్య గురైన విషయం తెలిసిందే. ఆమె హత్య పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నారాయణమ్మ బంగారం కోసం హత్య చేశారా?పాత కక్షలు నేపథ్యంలో హత్య చేశారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దుండగులు నారాయణమ్మ ముఖంపై దిండును అదిమిపెట్టి హత్య చేశారు. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న బంగారం వస్తువులను తీసుకెళ్లారు. ఈ ఘటన జరగటానికి గంట ముందు ప్రశాంతి థియేటర్ వద్ద మద్యం షాపులో ముగ్గురు యువకులు మద్యం కొనుగోలు చేసి అయ్యప్ప స్వామి గుడి ఎదురుగా రైల్వే గేటు సమీపంలో తాగుతుండగా రైల్వే పోలీసులు వారి గుర్తించి అక్కడ నుంచి పంపారు. వారే నారాయణమ్మ హత్య చేసిఉంటారేనని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు జాగిలాలు హత్య జరిగిన చోటు నుంచి దుండగులు వదిలి వెళ్ళిన చెప్పులు. గ్లౌజులను చూపించాయి. రహదారి మీదుగా రైల్వే గేట్ వరకూ వెళ్లాయి దీంతో రైల్వే గేట్ మ్యాన్ చెప్పిన దానికి ఇక్కడ జరిగిన దానికి సరిపోతుంది. ఆ వ్యక్తులు ఎవరు అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఇటీవల నారాయణమ్మ ఇంట్లో బేల్దారి పనులు చేయించారు. ఆ సమయంలో నారాయణమ్మ మెడలోని బంగారం చూసి బేల్దారులు ఏమైనా


పరిశీలిస్తున్న ఏఎస్‌పి

హత్య చేశారా అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి కుమారులు బిలాయి నుంచి శింగరాయకొండ వచ్చారు. శింగరాయకొండ సర్కిల్ పోలీసులు రంగంలోకి దిగారు. అయితే శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆర్చి వద్ద ఏర్పాటు చేసిన సిసి కెమెరా పనిచేయడం లేదు. అక్కడి సిసి కెమెరాలు పనిచేసే ఉంటే నిందితులను వెంటనే గుర్తించే అవకాశం ఉండేది. ఇళ్ల వద్ద పెట్టిన సిసి కెమెరాలు చెక్ చేసే సమయంలో ఒక్కటి కూడా పనిచేయలేదని తెలిసింది. ఒంగోలు ఎఎస్‌పి శ్రీధర్ రావు రైల్వే గేట్ వద్ద జాగిలాం ఆగిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం రైల్వే గేట్ సిబ్బందితో మాట్లాడారు. ఒంగోలు డిఎస్‌పి నాగరాజు ఆధ్వర్యంలో రూరల్ సిఐ కె రాంబాబు , శింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్ఐ ఫిరోజా ఫాతిమా, జరుగుమల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు , టంగుటూరు ఎస్ఐ ఖాదర్ బాషా, సిసిఎస్ ఎస్ఐ రామిరెడ్డి , ఆధ్వర్యంలో బందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలిస్తున్నారు.

డిఎస్‌పికి టిడిపి నాయకుల వినతి పత్రం

ప్రజాశక్తి-రేపల్లె

బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం రాంభొట్లవారిపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు చెరుకుపల్లి మాజీ జడ్పిటిసి పిట్టి శ్రీనివాస్‌రెడ్డిపై వైసీపీ నాయకులు అక్రమ కేసులు బనాయించటాన్ని నిరసిస్తూ రేపల్లె నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం రేపల్లె డిఎస్పి టి మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. రాంబోట్లవారిపాలెంలో సదరు తెలుగుదేశం పార్టీ నాయకుడికి చెందిన పొలానికి సంబంధించిన విషయంలో వైసిపి నాయకులు మధ్య ఏర్పడిన సివిల్ కేస్ విషయంలో వైసీపీ నాయకుల వత్తిడితో తెలుగుదేశం పార్టీ నాయకుడిపై అక్రమ కేసులు బనాయిస్తూ గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో చెరుకుపల్లి పోలీసులు శ్రీనివాస్ రెడ్డి ఇంటికి వచ్చి నిర్బంధించడాన్ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి, సీనియర్ న్యాయవాది మేకా పూర్ణచంద్రరావు న్యాయవాదులు యరగల్లా ధర్మతేజ శ్రీనివాస్ మూర్తి, మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య, మాజీ జెడ్పిటిసి మేక శివరామకృష్ణ, తెలుగుదేశం పార్టీ నాయకులు ర్యాలీగా డీఎస్పీ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం అందజేశారు.

రైలు కిందపడి మహిళా వీఆర్వో ఆత్మహత్య

ప్రజాశక్తి-చీరాల

ఆమె రెవెన్యూ ఉద్యోగి. వివిధ సమస్యలపై సచివాలయాలకు వచ్చిన అర్జీలను విచారించి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకు వెళుతుంది. ఏం జరిగిందో ఏమో.. రోజులాగే విధులు నిర్వహించేందుకు ఇంటి నుంచి వచ్చిన ఆమె రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాద ఘటన పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద శుక్రవారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే.. కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామానికి చెందిన సిహెచ్ నాగమణి(35) అనే వివాహిత పర్చూరు మండలం గొల్లపూడి గ్రామంలో వీఆర్వోగా విధులు నిర్వహిస్తోంది. అయితే శుక్రవారం విధులు నిర్వహించుకునేందుకు పర్చూరు వెళ్లవలసిన ఆమె చీరాల రైల్వే ట్రాక్ వద్ద చేరుకొని హ్యాండ్ బ్యాగ్‌ను పక్కనే ఉన్న స్తంభానికి తగిలించింది. అయితే అప్పటికే ఎవరితోనో సెల్‌ఫోన్లో తీవ్రంగా మాట్లాడుతూ స్థానికులు గమనించేలోపే మనస్థాపానికి గురై క్షణికావేశంలో ఒంగోలు వైపు వెళుతున్న రైలు కింద పడి ఆత్మహత్యకు చేసుకుంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు, పర్చూరు తహశీల్దారు నెహ్రూ బాబు, చీరాల, పర్చూరు రెవెన్యూ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మదేహాన్ని పరిశీలించారు. సంఘటన స్థలానికి పక్కనే తగిలించి ఉన్న మృతురాలు హ్యాండ్ బ్యాగ్‌ను గుర్తించి అందులోని పత్రాలను పోలిసులు పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. వీఆర్వో నాగమణి ఆత్మహత్య కుటుంబ కలహాలతోనా? పని ఒత్తిళ్ళతోనా? లేక వివాహేతర విషయాలా? అనే పలు కోణాలలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


మృతిచెందిన నాగమణి (ఫైల్)

ఐఎఎస్ అధికారి అభ్యంతర వ్యాఖ్యలపై విచారణ

ప్రజాశక్తి-వేటపాలెం: ఐఎఎస్ ఆఫీసర్ షన్‌మోహన్ అభ్యంతకరమైన వ్యాఖ్యలపై జిల్లా షెడ్యూల్డ్ కులముల సంక్షేమం, సాధికారిత అధికారి లక్ష్మనాయక్ శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నాయుడు నాగార్జునరెడ్డి ఫిర్యాదు మేరకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశంతో విచారణకు వచ్చినట్లు చెప్పారు. ముందుగా ఫిర్యాది, బాధిత కుంటుంబ సభ్యులను విచారించి లిఖిత పూర్వకంగా రిపోర్ట్‌ను రాయించుకొన్నారు. అనంతరం బాధిత చిన్నారి పుష్ప విద్యను అభ్యసించిన రామచంద్రపురంలోని ఎలిమెంటరీ స్కూల్‌కు వెళ్ళి ప్రధానోపాధ్యాయుడు వద్ద నుంచి రాతపూర్వకంగా నివేదికను తీసుకొన్నారు. ఈ సందర్భగా అప్పటి స్కూల్ రికార్డులను పరిశీలించారు. గ్రామంలో ఎలాంటి వివాదాలు తలెత్తకుండా ముందు జాగ్రత్తగా వేటపాలెం ఎస్ఐ జి సురేష్ బందోబస్తు నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి.. మండల పరిధిలోని పుల్లరిపాలెం పంచాయతీ రామచంద్రపురంలో కోడూరి వెంకటేశ్వర్లు కుటుంబాన్ని స్థానిక కాపులు వెలివేసిన సంగతి పాఠకులకు తెలిసిందే. అప్పట్లో విచారణకు వచ్చిన ఐఎఎస్ ఆఫీసర్ షన్‌మోహన్ 14-09-2019న గ్రామసభ జరిపి విచారణ జరిపిన అనంతరం వీడియాతో మాట్లాడుతూ, సదరు లేఖ బాలిక సిఎంకు రాయలేదని, లేఖ రాయడం అంతా అబద్ధమని, అలాగే స్కూలు సక్రమంగా నడుస్తోందని, స్కూలుకి విద్యార్థులను ఆపలేదని, ఈ వ్యవహారానికి సూత్రధారి నాయుడు నాగార్జునరెడ్డి అని, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అధికార హోదాలో విచారణకు వెళుతూ ఆమంచి కృష్ణమోహన్ ఇంటికి వెళ్లి భోజనం చేసి మరీ విచారణకు అతనితో కలిసి హాజరయ్యారు. రామచంద్రాపురంలో నేటికీ సాంఘిక బహిష్కరణ కొనసాగుతుండడం గమనార్హం. విచారణలో వేటపాలెం తహశీల్దార్ కె సంధ్యశ్రీ, నాగార్జునరెడ్డి, బాధిత కుటుంబ సభ్యులు ఉన్నారు.

నీటి గుంతలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కొండపి

నీటి గుంతలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన కొండపి పంచాయితీలోని కట్టావారిపాలెం దగ్గర ఉన్న లేఅవుట్ల పక్క ఉన్న నరసాయి కుంటలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపి మండలం నేతివారిపాలెం గ్రామానికి చెందిన మల్లవరపు బ్రహ్మయ్య(34) మరో ఇద్దరితో కలిసి కట్టావారిపాలెం సమీపంలోని జగనన్న కాలనీ నివాసాలకు సమీపంలో ఉన్న నరసాయి కుంటలో గురువారం నాడు బహిర్భూమికి వెళ్లారు. మిగిలిన ఇద్దరూ వేరే ప్రాంతంలో ఉండగా, నీరు తెచ్చేందుకు బ్రహ్మయ్య.. కాలనీ లెవలింగ్‌ల కోసం మట్టి తవ్విన కుంటలోకి వెళ్లాడు. ఈ కుంట సుమారు 30 అడుగుల లోతుంటుందని గ్రామస్థులు చెబుతున్నారు. కొంచెం లోపలికి దిగి నీరు ప్లాస్టిక్ డబ్బాలో నింపే క్రమంలో జారి లోపలికి వెళ్లిపోయాడు. అతడు వేసిన అరుపులు విని వచ్చిన ఇద్దరూ నీటిలో దిగే సాహసం చేయలేకపోయారు. గ్రామంలోకి వెళ్లి గ్రామస్థులను తీసుకొచ్చారు. ఎంత వెతికినా లోతు ఎక్కువగా ఉండటంతో అతడి ఆచూకీ దొరకలేదు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ప్రయత్నాలు చేసినా వీలు కాలేదు. చీకటి పడటంతో అందరూ వెనుతిరిగారు. శుక్రవారం నాడు ఉదయం మరలా పోలీసులు వెతికి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య జలజమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ యజమానిక మృతి చెందడంతో వారు కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు. వీరు ఎస్సీ కులానికి చెందిన కడు పేదలు. కూలి పనులు చేస్తేనే పొట్ట గడిచే పరిస్థితి కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె రామకృష్ణ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకొని పోయారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-తర్లుపాడు

మండలంలోని నాయుడుపల్లి గ్రామ సమీపంలోని పొలాలలో గురువారం రాత్రి సమయంలో గొబ్బూరు గ్రామానికి చెందిన కొర్రపోలు చిన్నసుబ్బారెడ్డి(24) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పురుగుల మందు తాగిన విషయం తెలుసుకున్న వారి బంధువులు హుటాహుటిన మార్కాపురం కందుల ఓబుల్‌రెడ్డి హాస్పిటల్‌కు తీసుకొని వెళ్లగా అప్పటికే చనిపోయినట్లుగా హాస్పిటల్ సిబ్బంది నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. వివరాల ప్రకారం గత రెండు సంవత్సరాల నుంచి కొర్రపోలు చిన్నసుబ్బారెడ్డి ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తూ ఇడుపూరు గ్రామానికి చెందిన యువతితో పరిచయం ఏర్పడి ఈనెల 8వ తేదీన కాణిపాకం దేవాలయంలో వివాహం చేసుకున్నారు. తదుపరి అమ్మాయి మేజర్ అయ్యేంతవరకు విడిగా ఉండాలని ఇరువర్గాల వారికి పెద్దలు తెలియపరచి పంపించారు. తదనంతరం అమ్మాయి తరపున తల్లిదండ్రులు ఎవరూ లేకపోవడంతో వారి బంధువులు కొర్రపోలు చిన్నసుబ్బారెడ్డిని మాటిమాటికి ఫోన్ చేసి బెదిరిస్తున్నారని, ఆ మానసిక వేదన తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తల్లిదండ్రులు, అన్నయ్య కన్నీటి పర్యంతమయ్యారు. తమ కొడుకు చావుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి ముక్కంటి తెలిపారు.


మృతిచెందిన చిన్నసుబ్బారెడ్డి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-పర్చూరు

గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు చెందిన మల్లేశ్వరరావు ద్విచక్ర వాహనంపై పర్చూరుకు వస్తున్న సమయంలో చిననందిపాడు చప్టా వద్ద గుంటలో పడిపోయాడు. తలకు బలమైన గాయమవటంతో 108 సహాయంతో పత్రిపాడు వైద్యశాలకు తరలించారు. ఏఎస్ఐ కోటేశ్వరరావు, రామానాయుడు సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

డివిజన్ స్థాయిలో ప్రభుత్వ పథకాలను అమలు చేయడానికి డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ విజయకృష్ణన్ వెల్లడించారు. శుక్రవారం బాపట్ల సూర్యలంక రోడ్డులో బాపట్ల డివిజన్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం డివిజన్ అభివృద్ధి అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. డివిజన్ స్థాయిలో పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడానికి ఇది మంచి అవకాశమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రమేష్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి రవీంద్ర, బాపట్ల డివిజనల్ పంచాయతీ అధికారి శరత్‌బాబు, చీరాల డివిజన్ పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, రేపల్లె డివిజనల్ పంచాయతీ అధికారి బాలమ్మ, బాపట్ల ఎంపీడీఓ రాధాకృష్ణ, తహశీల్దార్ కవిత పాల్గొన్నారు.



తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ప్రజలకు రక్షణ కల్పించాలని ధర్నా

ప్రజాశక్తి-నగరం

మండలంలోని సజ్జవారిపాలెం పల్లెలో ప్రజల మధ్య కులం, మతం పేరుతో వైరుధ్యాలను తీసుకువచ్చి గొడవలు సృష్టించేవారిపై చర్యలు తీసుకొని ప్రజలకు రక్షణ కల్పించాలని తహసీల్దార్ ఆఫీసు వద్ద గ్రామస్తులు కెవిపిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. గ్రామంలో చర్చి మరమ్మతులు చేస్తుంటే ఆటంకం కల్పిస్తూ హిందువులు, క్రిస్టియన్స్ పేరుతో కులాల పేరుతో ఘర్షణలు తీసుకువస్తున్న అద్దేపల్లి రాఘవులు అనే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సజ్జవారిపాలెం గ్రామంలో శాంతిభద్రతలకి ఆటకం లేకుండా చూడాలని కోరుతూ కెవిపిఎస్ (కులవివక్ష వ్యతిరేకంగా పోరాట సంఘం) ఆధ్వర్యంలో నగరం పోలీసు స్టేషన్ ఎస్ఐకి ఫిర్యాదు అందజేశారు. అక్కడ నుంచి సజ్జవారిపాలెం గ్రామాల్లో సంఘ పెద్దలు, మహిళలు 100 మంది ప్రదర్శనగా తహసీల్దారు ఆఫీసు వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మద్దతుగా పాల్గొన్న సిపిఎం బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ మణిలాల్ మాట్లాడుతూ భారతదేశంలో ఆర్ఎస్ఎస్ దాని అనుబంధం సంఘాలు వ్యక్తులు ప్రజల మధ్య కులాలు, మతాల పేరుతో చీలికలు తెస్తున్నారని విమర్శించారు. సజ్జవారిపాలెం గ్రామంలో కూడా ఒక వ్యక్తి దళితులకు సంబంధించినా ఎస్‌సి కుల సర్టిఫికెట్స్ రద్దుచేయాలని, గ్రామంలో గత 70 సంవత్సరాల నుంచి ఉన్న చర్చికి రిపేర్లు చేసుకుంటుంటే ఆటంకాలు కల్పిస్తున్నాడని పేర్కొన్నారు. మహిళలను కించపరుస్తూ అసభ్యకరంగా దూషిస్తు గ్రామంలో శాంతిభద్రతలకి ఇబ్బంది వచ్చేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నాడని కోరారు. అతనిపై చర్యలు తీసుకోవాలని సజ్జవారిపాలెం గ్రామంలో శాంతియుత వాతావరణం ఉండేలా స్థానిక పోలీసు, తహసీల్దార్ బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ జిల్లా నాయకులు టి కృష్ణమోహన్ మాట్లాడుతూ సజ్జవారిపాలెం గ్రామంలో బిజెపి అనుబంధ ఆర్ఎస్ఎస్ సంఘాలు ప్రజలు మధ్య కులం పేరుతో చీలికలు తెస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు వీటిని ఐక్యంగా తిప్పికొట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సజ్జవారిపాలెం గ్రామంలో ప్రజలు, మహిళలు కెవిపిఎస్ నాయకులు కె శరత్ బాబు, బి నాగరాజు, కె మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పనులు వేగంగా పూర్తి చేయాలి: జేసీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

కొరిశపాడు ఎత్తిపోతల పథకం ఆయకట్టు భూములకు సాగునీరు అందిచడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె శ్రీనివాసులు తెలిపారు. కొరిశపాడు ఎత్తిపోతల పథకం భూసేకరణపై సంబంధిత అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఛాంబర్లో ఆయన సమావేశం నిర్వహించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు జలవనరుల ఆధారంగా కొరిశపాడు ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం నిర్మిస్తుందని జిల్లా సంయుక్త కలెక్టర్ చెప్పారు. ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని అన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్ నుంచి కొరిశపాడు సమీప ప్రాంతాలకు సాగునీరు అందించేలా ఎత్తిపోతల పథకాన్ని రూపొందించినట్లు వివరించారు. ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తయితే ప్రకాశం జిల్లాలోని 5,759 ఎకరాలు, బాపట్ల జిల్లాలోని 14,242 ఎకరాలు సాగులోకి



సమావేశం నిర్వహిస్తున్న జిల్లా సంయుక్త కలెక్టర్ శ్రీనివాసులు

వస్తాయన్నారు. భూ సమస్యలపై కోర్టు కేసులు ఉండడం ద్వారా పథకం నిర్మాణ పనులు నిలిచిపోవడం బాధాకరమన్నారు. పథకం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.177 కోట్లు గతంలోనే మంజూరు చేసిందన్నారు. ఇప్పటివరకు 60 శాతం పనులు పూర్తి కాగా రూ.114 కోట్లు ఖర్చయిందన్నారు. ఎత్తిపోతల పథకం నిర్మాణానికి 1,676 ఎకరాలు అవసరం కాగా 1,274 ఎకరాలు కావాలంటూ జలవనరుల శాఖ ఇంజినీర్లు ప్రతిపాదనలు పంపారని ఆయన వివరించారు. ఇప్పటివరకు 732 ఎకరాలు భూసేకరణ చేయగా, 542 ఎకరాలను సేకరించాల్సి ఉందన్నారు. 490 ఎకరాలపై కోర్టు కేసులు ఉన్నాయని, మిగిలినవి ఇతర సమస్యలతో సేకరించలేక పోయామన్నారు. భూసేకరణ వేగంగా చేపడితే ఎత్తిపోతల పథకం నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. తద్వారా వేలాది ఎకరాలు సస్యశ్యామలం అవుతాయని జిల్లా సంయుక్త కలెక్టర్ శ్రీనివాసులు చెప్పారు. సాంకేతిక సమస్యలు, చట్టపరమైన ఇబ్బందులు లేకుండా అధికారులు సమగ్ర ప్రణాళికతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో భూసేకరణ ప్రత్యేక కలెక్టర్ ఎస్ సరళావందనం, ప్రత్యేక ఉప కలెక్టర్ ఉమాదేవి, ప్రాజెక్టుల ఇఇ చినబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వం ఉండాలి: జెవివి

ప్రజాశక్తి-చీరాల

విద్యార్థులందరూ ప్రశ్నించే తత్వాన్ని పెంచుకోవాలని, తద్వారా ప్రయోగాత్మక విద్య పట్ల అవగాహన పెరిగి శాస్త్రీయ ఆలోచన వైపు అడుగులు వేస్తారని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కుర్రా రామారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్లో విద్యార్థులకు జెవివి ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి పరీక్ష పత్రాన్ని జెవివి నాయకులు, ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెవివి నాయకులు మాట్లాడుతూ జెవివి ప్రభుత్వ సహకారంతో గత 33 సంవత్సరాలుగా విద్యార్థులకు చెకుముకి పరీక్షలను నిర్వహిస్తోందని అన్నారు. అనంతరం చెకుముకి ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ సుభాని, నోడల్ ఆఫీసర్, సైన్స్ ప్రాజెక్ట్ పవని భాను చంద్రమూర్తి, జన విజ్ఞాన వేదిక చీరాల డివిజన్ బాధ్యులు బిరుదు పిచ్చయ్య, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ జానీ బాషా, ఆదిశంకర్, గీతా సంస్థ అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ, జి సూరిబాబు, కుర్రా శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ఎం కే వీరాంజనేయులు, కే కృష్ణమోహన్ రావు పలువురు పాల్గొన్నారు.

చెరుకుపల్లి: నేటి బాలలే రేపటి భావి భారత శాస్త్రవేత్తలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఇంకొల్లు రంగారావు అన్నారు. మండల స్థాయి చెకుముకి సైన్సు సంబరాలు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గుల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పోటీలు నిర్వహించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఇంకొల్లు రంగారావు పాల్గొని గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. పాఠశాలల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన 8,9,10 తరగతుల విద్యార్థులను ఒక గ్రూపుగా ఎంపిక చేసి ఆయా పాఠశాలల తరఫున ప్రాతినిధ్యం వహించగా, మొత్తం వివిధ యాజమాన్యాల స్థాయిలో 16 జట్లు పోటీలలో పాల్గొన్నాయి. పోటీలలో ప్రభుత్వ పాఠశాల విభాగంలో చెరుకుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం సాధించగా, కావూరు ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల వినయాశ్రమం విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. ప్రైవేటు విభాగంలో గూడవల్లి వనజ చంద్ర పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం, హెూలియర్ వరల్డ్ స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. గెలుపొందిన విద్యార్థులను డిసెంబర్లో నిర్వహించే జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు కాటూరి నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు కుంచా రామమోహన్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, స్కూల్ కమిటీ చైర్మన్ మంచాల విజయ్ కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



చీరాలలో చెకుముకి పరీక్ష పత్రాలు ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

సంతమాగులూరు: సైన్సు పట్ల ఆసక్తి పెంచుకొని సాంకేతికపరంగా దేశాభివృద్ధిలో విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని మండల విద్యాశాఖాధికారి వేమవరపు కోటేశ్వరరావు కోరారు. శుక్రవారం చెకుముకి సైన్స్ సంబరాలు కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి ఆటల పోటీలలో, మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులు 9 గ్రూపులుగా పాల్గొన్నారు. ఈ పోటీలలో జడ్పీ ఉన్నత పాఠశాల మక్కెనవారిపాలెం విద్యార్థులు ప్రథమ స్థానం, జడ్పీ ఉన్నత పాఠశాల ఏల్చూరు ద్వితీయ స్థానాన్ని, సంతమాగులూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానాన్ని పొందారు. బహుమతుల ప్రదానోత్సవానికి ఉపాధ్యాయిని అంజలి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ఎంఈఓ కోటేశ్వరరావు పాల్గొని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి ఆనంద్ కుమార్, జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు వి లక్ష్మి, సహాధ్యక్షులు మోహనాంజలి, జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి వివి రామకృష్ణ, యుటిఎఫ్ నాయకులు వలి ఖాన్, పుల్లారావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కర్లపాలెం: జిల్లా స్థాయిలో జరుగు చెకుముకి ప్రతిభాపరీక్షకు కర్లపాలెం నుంచి జడ్పీహెచ్ఎస్ యాజలి విద్యార్థులు ఎంపికైనట్లు మండల జన విజ్ఞాన వేదిక ప్రతినిధి ఈ పోలీసురావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంవి రాజుపాలెం ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి ప్రతిభా పరీక్షలను నిర్వహించారు. యాజలి జెడ్పిహెచ్ఎస్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన జట్టు వచ్చే నెల బాపట్ల జరిగే జిల్లా స్థాయి పరీక్షల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాపూజీ రెడ్డి, కరుణాకర్, విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్: జన విజ్ఞాన వేదిక, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) వారు సంయుక్తంగా నిర్వహించే చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్ష ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు జి.శ్రీనివాసరావు ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. 6 పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా గంగవరం ఎస్‌వికె హైస్కూలు విద్యార్థులు ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 11,12 తేదీల్లో జరిగే జిల్లా స్థాయి పరీక్షలకు హాజరవుతారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి యు చెంచయ్య, కెజెఆర్ కుమారి, ఎం సుమలత, ఎన్ రాజశ్రీ, మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎ శ్రీమన్నారాయణ, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె మస్తాన్‌వలి, సైన్స్ ఉపాధ్యాయిని రాధారాణి, షణ్ముఖ, మరియన్‌బాబు, సిహెచ్ హనుమంతరావు, కె రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పిట్టలవాని పాలెం: పిట్టలవానిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మాధవరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షలో మొత్తం ఆరు గ్రూపులు పాల్గొన్నాయి. చెకుముకి టాలెంట్ పరీక్షలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఖాజీపాలెం గ్రూప్ మొదటి స్థానంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అల్లూరు గ్రూప్ రెండో స్థానంలో సాధించారు. ఈ పరీక్షకు పరిశీలకులుగా నజీర్, ప్రసాద్, అయ్యప్ప, వెంకటేశ్వర్‌రెడ్డి, కోటేశ్వరరావు, అనిల్ వ్యవహరించారు. గెలుపొందిన విద్యార్థులకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల శాఖ అధికారి ఉయ్యూరి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ప్రశంసాపత్రం, బహుమతులు అందజేశారు. విద్యార్థులను ఆశీర్వదించి ఇలాంటివి ఇంకా ఎన్నో సాధించాలని అభినందించారు. ఈ పరీక్షలో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పరీక్షకు అర్హత సాధించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఖాజీపాలెం విద్యార్థులను యుటిఎఫ్ మండలం శాఖ అధ్యక్షులు రహంతుల్లా, ప్రధాన కార్యదర్శి రఫీబుద్దీన్ అభినందించారు.

అద్దంకి: జన విజ్ఞాన వేదిక అద్దంకి మండల స్థాయి చెకుముకి ప్రతిభా పరీక్షను కాకానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ పరీక్షను స్థానిక ఎంఈఓ పివి రాఘవరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డివిజన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎలగాల హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థులు పరిశీలన, ప్రశ్నించడం ద్వారా శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. స్థానిక ప్రధానోపాధ్యాయులు ఎన్‌సిహెచ్ గురవయ్య, జన విజ్ఞాన వేదిక బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ కె ప్రభుదాసు, గౌరవాధ్యక్షులు మన్నం త్రిమూర్తులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ శ్రీనివాసరావు, యుటిఎఫ్ అద్దంకి మండల శాఖ అధ్యక్షులు ఎట్టా రామారావు, డివిజన్ అధ్యక్షులు బి చంద్రశేఖరరావు ఉపాధ్యాయులు ఎంవి సురేష్‌బాబు, సిహెచ్ లక్ష్మీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం: కళాశాల ఆచార్యులు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని బాపట్ల ఫుడ్ సైన్స్ కళాశాల ఆచార్యులు కే సౌజన్య, ఎస్ బ్లెస్సి సాగర్ అన్నారు. శుక్రవారం బాపట్ల మండలం బేతపూడి గ్రామంలో జరిగిన ఎన్ఎస్ఎస్ క్యాంప్‌లో భాగంగా ప్లాస్టిక్ వినియోగ నివారణపై అవగాహన కల్పించారు. మితిమీరిన ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. అలాగే గ్రామంలోని రోడ్లపైన పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. పండ్లు, కూరగాయలతో జామ్, సాస్, స్క్వాష్, మురబ్బా వంటి ఆహార పదార్థాలు ఎలా తయారు చేసుకోవచ్చో గృహిణులకు వివరించారు. అలాగే కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదగవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పి తిరుపతిరెడ్డి, పి శ్రీనివాస్‌రెడ్డి, జి రవికాంత్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి 5
శనివారం 19 నవంబర్ 2022

ఉద్యోగుల సంక్షేమాభివృద్ధి కోసం

పెట్రోల్ బంకు నిర్వహణ

రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ సురేష్



పెట్రోల్ బంకు ప్రారంభోత్సవంలో మంత్రి సురేష్

ప్రజాశక్తి-మార్కాపురం

ఉద్యోగుల సంక్షేమం కోసం ఆదాయ వనరులు పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో ఏర్పాటు పెట్రోల్ బంకు (ఫిల్లింగ్ స్టేషన్)ను మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శుక్రవారం ప్రారం భించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ రాష్ట్రంలో మొదటి సారిగా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు నిర్వహణ మార్కాపురంలో ప్రారంభించినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే పెట్రోల్ బంకులో నాణ్యతతో పాటు కొలతలో మోసం ఉండదన్నారు. ఇక్కడ నిర్వహణ బాధ్యతలు తీసుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు కూడా నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. పెట్రోల్ బంకు నిర్వహణ ద్వారా వచ్చిన ఆదాయంతో అగ్నిమాపక శాఖ ఉద్యోగుల సంక్షేమాభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, డిఎస్‌పి డాక్టర్ ఎం.కిశోర్‌కుమార్, తహశీల్దారు శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ బిఎస్.గిరికుమార్, శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు మెంబర్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, సిహెచ్.అంజమ్మ శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు టి.రంగలక్ష్మి, దారివేముల హర్షిత బాబి, బుశ్శెట్టి నాగేశ్వర రావు, మొఘల్ సిరాజ్‌తుల్లా బేగ్, దొడ్డా భాగ్యలక్ష్మి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు గుంటక వనాజక్షి చెన్నారెడ్డి, సయ్యద్ ఆబిదా మయూర్ ఖాశిం, అగ్నిమాపక శాఖ అధికా రులు, వైసిపి నాయకులు ఎం.ఉత్తమ్ కుమార్, రోజ్ లిడియా పాల్గొన్నారు.

'పాలిటెక్ ఫెస్ట్' రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు...

'ఇందిరా డిప్లమో కళాశాల' ప్రాజెక్టు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న వెన్నా హనుమారెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలోని ఇందిరా డిప్లమో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు సాంకేతిక రంగంలో రాణిస్తున్నారు. ఈ నెల 16, 17వ తేదీల్లో ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో జరిగిన జిల్లా స్థాయి పాలిటెక్ ఫెస్ట్‌లో మార్కాపురంలోని ఇందిరా డిప్లమో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన 'పవర్ జనరేషన్ త్రు స్పీడ్ బ్రేకర్స్ బై యూజింగ్ మెకానిజం' అనే ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. ఈ ప్రాజెక్టును ఇందిరా డిప్లమో పాలిటెక్నిక్ కళాశాలలో మూడవ సంవత్సర విద్యార్థులు కె.ఆంజనేయులు, షేక్ జాయిద్ హుస్సేన్‌లు రూపొం దించారు. రూపొందించిన విద్యార్థులతో పాటు ప్రాజెక్టు డిజైన్ చేసిన డిప్లమో ఇన్‌చార్జి షేక్ అబ్దుల్ కలాంను ఆ కళాశాల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి శుక్రవారం ఆ కళాశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అభినందిం చారు. ఈ ప్రాజెక్టు ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో ఉండబోతోంది. అభినం దించిన వారిలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ గోపాలక్రిష్ణ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జయరాంరెడ్డి, మెకానికల్ విభాగాధిపతి కె.రాజశేఖరరెడ్డి, ఇతర విభాగాల అధిపతులు కె.సురేందర్‌రెడ్డి, జె.సాయిబాబా, ఆర్.పుష్ప లత ఉన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

సిఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా స్థానిక జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలను మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని తెలిపారు. గెలుపు ఓటములు సహజమని, ప్రతి ఒక్కరూ క్రీడలలో స్నేహ భావంతో మెలగాలని, ప్రతిభను మెరుగు పరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ, ఎంపిపి పోరెడ్డి అరుణ చెంచిరెడ్డి, ఎంపిడిఓ తోట చందన, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్‌రెడ్డి, ఇఒపిఆర్‌డి రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధికారులు,లబ్ధిదారులతో మాట్లాడుతూన్న ఉప కలెక్టర్ సేతుమాధన్

గృహ నిర్మాణంలో నిర్లక్ష్యాన్ని సహించం

ఉపకలెక్టర్ సేతు మాధవన్

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ఉప కలెక్టర్ సేతుమాధవన్ తెలిపారు. మండల పరిధిలోని గజ్జలకొండ గ్రామంలో హౌసింగ్ డే సందర్భంగా శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప కలెక్టర్ సేతు మాధవన్ మాట్లాడుతూ ప్రతి పేదవారికి ఇళ్లు నిర్మించాలనే ఉద్దేశంతో అర్హులైన వారందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేసినట్లు తెలిపారు. హౌసింగ్ అధికారులు అందరూ సమన్వయంతో పని చేసి జగనన్న ఇళ్ల నిర్మాణాలలో రోజురోజుకు పురోగతి కనిపించేలా చూడాలన్నారు. లబ్ధిదారులకు సకాలంలో సిమెంట్, స్టీలు, ఇసుక అందజేయాలన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులూ రాకూడదన్నారు. నీరు, విద్యుత్తు సమస్య లేకుండా చూడాలన్నారు. అనంతరం ఇడుపూర్-2 లేవుట్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఇ పవన్‌కుమార్, ఎఇ చందు, ఎంపిడిఓ తోట చందన, తహశీల్దారు శ్రీనివాసరావు, మండల విస్తరణ అధికారి రామ్మోహన్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఎఇ మోహన్‌రాజా, పంచాయతీ కార్యదర్శి నూనె శివారెడ్డి, ఎపిఎం రమేష్‌బాబు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మంత్రి డాక్టర్ సురేష్

మార్కాపురం మున్సిపాలిటీలో...

శాశ్వత తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

పైప్‌లైన్ శంకుస్థాపనలో మంత్రి డాక్టర్ సురేష్

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలో తాగునీటి ఎద్దడిని శాశ్వతంగా నివారించేందుకు చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ చెప్పారు. మార్కాపురం మున్సిపాలిటీకి చెందిన దూపాడు వద్దగల సమ్మర్ స్టోరేజి ట్యాంకు నుంచి కేసినేనిపల్లి జంక్షన్ వరకు పాత పైప్‌లైన్ స్థానంలో రూ. 4.70 కోట్లతో కొత్తగా నిర్మించనున్న పైప్‌లైన్ నిర్మాణ పనులకు మంత్రి డాక్టర్ సురేష్‌తో పాటు మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి దూపాడు వద్ద శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ సురేష్ మాట్లాడుతూ మార్కాపురం మున్సిపాలిటీలో ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చడంలో గత పాలకులు విఫలమయ్యారన్నారు. తాగునీటి అవసరాలు కూడా తీర్చలేని టిడిపి నేతలు తమను విమర్శించడం సరికాదన్నారు. మార్కాపురం మున్సిపాలిటీలో ఇంటింటికీ సాగర్ నీటిని అందించబోతున్నామని చెప్పారు. మార్కాపురం మున్సిపాలిటీలో సాగర్ నీటితో దాహం తీర్చేందుకు రూ. 22.40 కోట్లతో పనులు చేపడుతున్నామన్నారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తయితే మార్కాపురం మున్సిపాలిటీలో తాగునీటి సమస్య అన్నదే ఉండదని తెలిపారు. కార్యక్రమంలో మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ, వైస్ చైర్మన్‌లు షేక్ ఇస్మాయిల్, సిహెచ్.అంజమ్మ శ్రీనివాస్, శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు మెంబర్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ,ఎఎంసి చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, కమిషనర్ బిఎస్ గిరికుమార్, డిఇ షేక్ సుభానీ, ఎఇ ఆదినారాయణ, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న దశ్యం

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఒంగోలు పార్లమెంట్ వైసిపి వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు పాల్గొని అశోక్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశాడు. పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య కూడా డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా పలువురు అధికారులు, నాయకులు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డికి జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు.



అయ్యప్పస్వామి అన్నదానాన్ని ప్రారంభించిన బూచేపల్లి

అయ్యపస్వామి గుడికి

రూ. 5 లక్షల విరాళం

ప్రజాశక్తి-దర్శి

దర్శిలోని అయ్యపస్వామి గుడి అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి రూ. 5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. అయ్యప్ప స్వామి గుడిలో మాలధారణ దారులకు ఉచిత అన్నదాన్ని శుక్రవారం ప్రారంభించారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ. శివప్రసాద్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అచ్యుత కొండలు, మారం శివకోటిరెడ్డి, షేక్ కార్పోరేషన్ డైరెక్టర్ బాషా, ఎఎంసి మాజీ చైర్మన్ కెవిరెడ్డి, సద్ది పుల్లారెడ్డి, శ్రీనివాసరెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.



బుక్‌లెట్ అందజేస్తున్న వరికూటి అశోక్‌బాబు

ప్రతి సమస్యను పరిష్కరిస్తాం : వరికూటి

ప్రజాశక్తి-శింగరాయకొండ

కనుమళ్ల పంచాయతీలో ప్రతి సమస్యను పరిష్కరిస్తామని వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక బాబు తెలిపారు. కనుమళ్ల గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కట్టా శోభారాణి , సొసైటీ చైర్మన్ మలినేని వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతపల్లి హరిబాబు ,ఎంబిసి డైరెక్టర్ పుట్ట వెంకటరావు, ఇఒఆర్‌డి అంజలీదేవి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ ,సునీత ,పెండ్యాల శ్రీనివాసరావు, రాజు ,వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-దర్శి

మండల పరిధిలోని పోతరం గ్రామంలో గతంలో ఉచితంగా మోకాళ్ల నొప్పుల వైద్య శిబిరం నిర్వహించారు. అందులో భాగంగా మోకాళ్ల చిప్ప మార్పిడి ఆపరేషన్ కోసం 8 మందిని గుంటూరులోని ఆదిత్య మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌కు శుక్రవారం తరలించారు. ఈ కార్యక్రమంలో జనసేవ జిల్లా లీగల్‌సెల్ కార్యదర్శి, దర్శి నియోజకవర్గ జనసేన నాయకుడు వరికూటి నాగరాజు, నాయకులు లక్ష్మయ్య, ఇర్షాద్, సుబ్బు, అజయ్ పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ దంపతులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన కుమారుడి వివాహానికి రావాలని శుభలేఖ అందజేశారు.
- ప్రజాశక్తి - దర్శి

ఘనంగా జెవివి చెకుముకి టాలెంట్ టెస్టు



పాదిలిలో చెకుముకి టాలెంట్‌టెస్టు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

జాన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు బి.శ్రీదేవి, సిద్ధార్ధ జూనియర్ కళాశాల చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, జాన విజ్ఞాన వేదిక డివిజన్ కార్యదర్శి ఏనుగుల రవికుమార్, దోర్నాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ షేక్ షావలి, ఉపాధ్యాయులు షేక్ రఫీ, కందగట్ల మల్లికార్జున, కందుల రవికుమార్ పాల్గొన్నారు. **సిఎస్‌పురం :** చెకుముకి సైన్స్ సంబరాలలో భాగంగా సిఎస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలను కనిగిరి డివిజన్ జెవివి నాయకులు కష్ణమూర్తి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.రజియా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు డి.నాగేశ్వరావు, బి.వి.ఎస్. రమేష్, భాస్కర్, చంద్ర, రంగస్వామి, మాధవి పాల్గొన్నారు. **పిసిపల్లి:** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో అలవలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని సాధించారు.ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసులు, జెవివి నాయకులు పాల్గొన్నారు. **పొన్నలూరు :** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ రవిచంద్రబాబు, జెవివి కందుకూరు డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.మహబూబ్‌బాషా, మండల బాధ్యులు బివిఎల్.మూర్తి, ఉన్నం వెంకటరావు, కొండపి విశ్వేశ్వరరావు, సిహెచ్ పద్మావతి, ఎంవి.మోహన్, వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **పామూరు :** జెవివి ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి పరీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక డివిజన్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, జన విజ్ఞాన వేదిక నాయకులు శంకర్, ఉత్తరరావు, భోగేశ్వర రావు, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు రఫీ పాల్గొన్నారు. **శింగరాయకొండ :** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల జన విజ్ఞాన వేదిక ఆదివారం మండల స్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశ్నా పత్రాలను ప్రముఖ డాక్టర్ బి. హరిబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వెంకట్, జెవివి మండల అధ్యక్షులు శీలం సునీల్ కుమార్ రెడ్డి, విశ్రాంత ఎంఇఒ నరసింహ రావు, శ్రీనివాసమూర్తి ,విజయానంద్, ఆనంద కుమారి, కేశవరాజు పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి శామ్యూల్ జాన్, . జెవివి నాయకుడు జె శేఖర్ మాట్లాడుతు చిన్ననాటి నుంచే విద్యార్థులకు మూఢనమ్మకాల నిర్మూలన పట్ల అవగాహన కల్పించేందుకు, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించేందుకు జెవివి కషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బ్రహ్మయ్య, నాగమూర్తి, రామకాసులు నాయక్, కోటయ్య నాయక్ పాల్గొన్నారు. **పొదిలి :** జెవివిలాంటి ప్రతిభ పోటీ పరీక్షలలో పాల్గొన్నప్పుడు భవిష్యత్తులో చక్కగా రాణించగలుగుతారని సిఐ సుధాకర్ రావు అన్నారు. జన విజ్ఞాన వేదిక ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి గురుస్వామి అధ్యక్షతన పొదిలి పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో చెకుముకి టాలెంట్ టెస్టు ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెవివి డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు చంద్రశేఖర్, దేవ ప్రసాద్, చిట్టెంశెట్టి వెంకట కష్ణారావు, సిఐటియు నాయకులు ఎం. రమేష్ పాల్గొన్నారు. **తర్లుపాడు:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్టులో గెలుపొందిన విజేతలకు శుక్రవారం బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జెవివి మండల అధ్యక్షులు పెరుమాళ్ళ కోటిమోహన్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.మాదవి, జెవివి జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి రఫి, జెవివి నాయకులు బాదుల్లా, సుదీర్, ఉపాధ్యాయులు, గోసు శ్రీనివాసులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సంబరాలు నిర్వహించారు. ప్రశ్నాపత్రాలను ప్రిన్సిపల్ ఎస్.నాగశేషారావు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కోలా కిరణ్, జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు గొనావత్ ప్రతాప్‌నాయక్, గిరిజన బాలుర పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు గోవిందరావు ఆవిష్కరించారు. **కొత్తపట్నం :** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జెవివి ఆధ్వర్యంలో చెకుముకి లాటెంట్ టెస్టు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానో పాధ్యాయుడు సుబ్బారావు, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు, వెంకట్రావు, సునంద, సరోజ, ధనలక్ష్మి, రవీంద్ర, ఇందిరా ప్రియదర్శిని,పాల్గొన్నారు. **సంతనూతలపాడు రూరల్ :**. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక రెసిడెన్షియల్ స్కూల్ మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రశ్నాపత్రాలను ఎంఇఒ సనత్ కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపి రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ మెర్సి, జెవివి రాష్ట్ర నాయకుడు, సుబ్రహ్మణ్యం, జిల్లా నాయకులు కోదాటి కోటేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి నరసింహం, మండల కార్యదర్శి సాంబశివరావు, జిల్లా సైన్స్ అధికారి రమేష్, పాల్గొన్నారు. **మద్దిపాడు :** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఆంజనేయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, జెవివి మండల అధ్యక్షుడు సుబ్బారావు, ఉపాధ్యక్షులు పి. ఉషారాణి. ఉపాధ్యాయులు ఎం. రామారావు పాల్గొన్నారు **టంగుటూరు :** విద్యార్థులు మూఢనమ్మకాల పట్ల అవగాహనతో వాటికి దూరంగా ఉండాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జయప్రకాష్ సూచించారు. టంగుటూరు హై స్కూల్ లో మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యమంలో టంగుటూరు హై స్కూల్ స్టాఫ్ సెక్రటరీ యాకోబు, శేషయ్య, మహేశ్వరరావు, ప్రకాశరావు పాల్గొన్నారు. **చీమకుర్తి :** మండల స్థాయి చెకుముకి టెస్టులో గెలుపొందిన విద్యార్థులకు జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఎ జవహర్ బహుమతులు అందజేశారు ఎస్‌ఐ అంజనేయులు, ఎంఇఒ రవి, జెవివి డివిజన్ అధ్యక్షుడు నల్లూర్ వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు చలువాది రమేష్,సుదర్శన గ్రానైట్ అధినేత నూనె హేమసుందరరావు, ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

'ఆవాస్‌యోజన' పై అవగాహన

ప్రజాశక్తి-పిసి.పల్లి

మండలంలోని ముద్దపాడు, తలకొండపాడు గ్రామ పంచాయితీలలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకంలోని లబ్దిదారులతో గహా నిర్మాణంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎంపిడిఒ డివి.రమణారెడ్డి, తహశీల్దార్ ఎస్.వెంకటేశ్వర్లు, విస్తరణాధికారి డి.నాగమల్లేశ్వరి, హౌసింగ్ ఇన్‌ఛార్జి ఎఇ, గ్రామ పంచాయితీ కార్యదర్శి, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు వీరే

విద్యార్థులకు చదరంగం పోటీలు

ప్రజాశక్తి-తర్లుపాడు

స్థానిక శాఖాగ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం వివిధ పాఠశాలల విద్యార్థులకు క్విజ్, చదరంగం పోటీలను గ్రంథపాలకుడు ఎస్.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 20న ముగింపు వారోత్సవాల సందర్భంగా బహుమతులను ప్రధానం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎ స్కూల్ ఉపాధ్యాయులు జి శ్రీనివాసరెడ్డి, కోటి మోహన, విద్యా వాలంటరీ, పదికల రామయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయులు జి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ బుక్ లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే అన్నా

పేదల సంక్షేమమే ధ్యేయం : అన్నా

ప్రజాశక్తి - గిద్దలూరు

పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నట్లు గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు తెలిపారు.గిద్దలూరు-9 సచివాలయం పరిధిలోని నల్లబండ బజార్ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడపగడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి గురించి ప్రజలకు వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కరించాలని నగర పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ పాముల సుబ్బయ్య, వైస్ చైర్మన్లు కాతా దీపికా, ఆర్‌డి.రామకష్ణ, వైసిపి నాయకులు షేక్షావలి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

21న ప్రత్యేక స్పందన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవనంలో ఈ నెల 21న ఉదయం 10 గంటలకు ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు రవీంద్ర రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధ్యక్షత జరుగుతుందని తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రూ 50.31 లక్షలతో సిసి రోడ్డుగా ఆధునీకరణ

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రజాశక్తి
కథనానికి స్పందన

టంగుటూరు బస్ స్టాప్ సెంటర్ నుంచి కొండపి రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జీ వరకు అడుగడుగునా గుంతలు పడి అత్యంత అధ్వానంగా మారిన టంగుటూరు - కొండపి రోడ్డును రూ.50.31 లక్షలతో సిసి రోడ్డుగా నిర్మించేం దుకు నిర్ణయించారు. ప్రజాశక్తి దిన పత్రికలో అధ్వానంగా టంగుటూరు-కొండపి రోడ్డు అనే శీర్షికతో ఓ కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి రోడ్లు భవనాల శాఖ అధికారులు స్పందించారు. స్థానిక బొమ్మల సెంటర్ నుంచి ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం మీదుగా కొండపి రోడ్డు ఫ్లై ఓవర్ బ్రిడ్జీ వరకూ 700 మీటర్లు పొడవున ఉన్న ఈ రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డు 300 మీటర్లు సిసి రోడ్డుగా, మరో 400 మీటర్లు మేర బీటీ రోడ్డు నిర్మించేందుకు గతంలో న్యూ డెవలప్ మెంట్ బ్యాంక్ (ఎన్ డిబి) నిధులు మంజూరు చేశారు. అయితే అధికారులు బీటీ రోడ్డుగా మంజూరైన 400 మీటర్లను కూడా సిసి రోడ్డుగా మార్పు చేశారు. మొత్తం 700 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి 50.31 లక్షల వ్యయ అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి నిధుల రాగా టంగుటూరు-కొండపి రోడ్డును పూర్తిస్థాయిలో సిసి రోడ్డుగా ఆధునీక రించనున్నట్లు ఆర్‌అండ్‌బి ఎఇ చొప్పర శ్రీకాంత్ ప్రజాశక్తికి వివరించారు.

బైపాస్ రోడ్డు పనులు పూర్తిచేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-సిఎస్‌పురం

సి ఎస్ పురం బైపాస్ రోడ్డు పనులు పూర్తి చేసి వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించే విధంగా అధికారులు పని చేయాలని సిపిఎం నాయకులు, కార్యకర్తలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా రోజులుగా రోడ్డు మీద కంకర తొలి వదిలి వేయడం వల్ల ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులకు ఎన్నో సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. కాంట్రాక్టర్లు అధికారపార్టీకి చెందిన వారు కావడం వల్ల రోడ్డు నిర్మాణ పనులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ బాలకేశవులుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఊసా రాజ్యలక్ష్మి, తిరుపతిరెడి, పోలయ్య, కనకయ్య పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్య సేవలు

యర్రగొండపాలెం: స్థానిక చైతన్య నగర్‌లోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్-2లో వెంకటాద్రిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ కోటా నాయక్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, వ్యాధులు, బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు కలిపి మొత్తం 61 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచి అరుణాబాయి, కార్యదర్శి ఈదుల రాజశేఖ ర్‌రెడ్డి, సచివాలయం-2 పంచాంయతీ కార్యదర్శి వెంకయ్య, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి సుంకర సునీత

సమన్వయంతో పనిచేయాలి : ఎంపిపి

ముండ్లమూరు : మండల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపిపి సుంకర సునీత తెలిపారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఎఇ హనుమంతరావు మాట్లాడుతూ గృహాలకు జియో ట్యాగ్ చేయకపోతే బిల్లు రావని తెలిపారు. బిల్లులు రాకపోతే లబ్ధిదారులు ఏమి చేయాలని వైస్ ఎంపిపి బంకా రమణమ్మ అధికారులను నిలదీశారు. ఈ కార్యక్రమంలో మక్కెనవారిపాలెం సర్పంచి నల్లమోతు వెంకటేశ్వర్లు, ఎంఇఒ చంద్రమౌళి, జడ్‌పిటిసి టి.రత్నరాజు, ఎంపిడిఒ కుసుమకుమారి. డిప్యూటీ తహశీల్దారు గుణపాటి పుల్లారెడ్డి. వైఎస్ ఎంపిపి వేముల పద్మ. ఎఒ మీరమ్మ, సిడిపిఒ భారతి, పశు వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి, వైద్యాధికారి డాక్టర్ జ్యోతి పాల్గొన్నారు.

కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు



వినతిపత్రం అందజేస్తున్న కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి- సంతనూతలపాడు రూరల్

పచ్చాకు కూలీలకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో పచ్చాకు కూలీలు, మేస్త్రీల టోకర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అన్నవరపు శేషారావు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ భారత దేశంలో ప్రతి ఏడాది 800 మిలియన్ కిలోల పొగాకును ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. ప్రకాశం జిల్లాలో 100 మిలియన్ కిలోల పొగాకును ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. పొగాకు ఉత్పత్తి ద్వారా కేంద్ర ప్రభుత్వానికి రూ.8,500 కోట్లు ఎగుమతి పన్నుల రూపంలో. రూ.4 వేల కోట్ల రూపాయలు అమ్మకం పన్ను రూపంలోనూ ఆదాయంగా వస్తుందని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పచ్చాకు కూలీ పెంపుకోసం అందరూ ఐక్యంగా ఉండి సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కెజి. మస్తాన్, మండల నాయకులు ఈదర సుబ్బారావు, పూరి మిట్ల బ్రహ్మయ్య, అద్దంకి భగత్ సింగ్, మాలకొం డయ్య, ఆనందరావు, సుబ్బారావు ఇస్తర్ల రాములు పాల్గొన్నారు.

జగనన్న గృహాల నిర్మాణాలపై అవగాహన



తర్లుపాడులో జగనన్న కాలనీ నిర్మాణాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-పెద్దారవీడు

మండలంలోని కంభంపాడు పంచాయతీలోని మల్లవరం గ్రామంలో జగనన్న లేఅవుట్‌లోని లబ్దిదారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్పెషల్ అధికారి, జిల్లా డ్వామా పీడీ కె.సీనారెడ్డి పాల్గొని మందుగా లేఅవుట్‌లను పరిశీలించారు. అనంతరం మల్లవరం గ్రామంలో లబ్దిదారుల తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పీడీ సీనారెడ్డి మాట్లాడుతూ జగనన్న లే ఆవుట్ ఉన్న లబ్దిదారులు అందరూ త్వరగా ఇళ్ల నిర్మానం పూర్తి చేయాలన్నారు. ఎమైనా సమస్యలు ఉంటే తమ దష్టికి తీసుకురావాలన్నారు. బిల్లులు కూడా వెంటనే మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎంవి.క్రిష్ణారెడ్డి, ఎంపిడిఒ రాజ్‌కుమార్, ఎపిఒ సాంబశివయ్య, ఎపిఎం శ్రీనివాసులు, పంచాయతీరాజ్ ఎఇ వెంకటరెడ్డి, సర్పంచి బెజవాడ ఆదాం, ఆర్ఐ శ్రీనివాసులు, ఇఒఆర్‌డి జయరామ్‌నాయక్, టెక్నికల్ అసిస్టెంట్ అనిల్‌కుమార్‌రెడ్డి, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మల్లారెడ్డి, నాసరయ్య పాల్గొన్నారు. **తర్లుపాడు :** మండలం లోని మాగేళ్ళ ముడుపు పంచాయతీలో జగనన్న కాలనీ లేఆవుట్లను ప్రత్యేకాధికారి కె.పరమేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులకు జగనన్న కాలనీ గహాలను నిర్మించుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ బొడ్డుచర్ల శ్రీనివాసరావు,ఎంపిడిఒ నరసింహులు, హౌసింగ్ ఏఇ శ్రీనివాసులు రెడ్డి, ఎపిడి జీవరత్నం, విజయభాస్కర్‌రెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు. **కొండపి :** ప్రతి లబ్ధిదారుడు గృహాన్ని నిర్మించుకోవాలని మండల ప్రత్యేక అధికారి అన్నపూర్ణ అన్నారు. వివిధ పంచాయతీల్లోని జగనన్న కాలనీలను తహశీల్దారు సింగరావుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బ్రహ్మయ్య , గృహ నిర్మాణ శాఖ ఎఇ భూపతి, పంచాయితీ రాజ్ ఎఇ ప్రసాదు పాల్గొన్నారు. **టంగుటూరు :** పేదలందరికీ సొంతిల్లు ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని మండల ప్రత్యేక అధికారి నాగిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జమ్ములపాలెం గ్రామంలో ' ఫ్రై డే హౌసింగ్ డే' కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణాలలో ప్రభుత్వం ద్వారా ఎదురయ్యే సమస్యలను పరిష్కరిస్తామని, లబ్ధిదారులందరూ వెంటనే తమ గృహాలను నిర్మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అజిత, జమ్ములపాలెం పంచాయతీ కార్యదర్శి అరుణ కుమారి, ఎనిడమలూరు సర్పంచి శేషమ్మ పాల్గొన్నారు. **కొండపి :** ప్రతి లబ్ధిదారుడు గృహాన్ని నిర్మించుకోవాలని మండల ప్రత్యేక అధికారి అన్నపూర్ణ అన్నారు. వివిధ పంచాయతీల్లోని జగనన్న కాలనీలను తహశీల్దారు సింగరావుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బ్రహ్మయ్య , గృహ నిర్మాణ శాఖ ఎఇ భూపతి, పంచాయితీ రాజ్ ఎఇ ప్రసాదు పాల్గొన్నారు. **శింగరాయకొండ :** శింగరాయకొండ మండలం సోమరాజుపల్లి పంచాయతీలోని జగనన్న కాలనీ పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. జగనన్న కాలనీని శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఉష , ఎపిఒ ఆదిశేషు, ఎపిఎం సుధాకర్ పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** పక్కా గృహాలు మంజూరైన వారంతా త్వరగా నిర్మించుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ, మండల ప్రత్యేకాధికారి మర్ధన్ అలి తెలిపారు. మండల పరిషత్ సమావేశపు భవనంలో శుక్రవారం హౌసింగ్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఇ సురేష్, ఎంపిడిఒ రామసుబ్బ రంగయ్య, తహశీల్దారు రవీంద్రారెడ్డి, ఎకెపి ఎసి లక్ష్మిరెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి, లబ్ధిదారులు, వాలంటీర్లు, విఒఎలు పాల్గొన్నారు.

జల జీవన్ మిషన్ పథకానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-తర్లుపాడు

మండలంలోని నాగేళ్ళ ముడుపు పంచాయతీలోని బిసి కాలనీలో జల జీవనమిషన్ కింద ఇంటింటికీ కుళాయిలు వేసే పథకానికి సర్పంచి తిరుమల పెద్ద బాలసుబ్బమ్మ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.12.50 లక్షలతో ఈ పథకం కింద ఇంటింటికి కుళాయిలు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.నర సింహులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సుజన, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కందుల సుజాత, సర్పంచి చీదెళ్ల శ్రీనివాసులు, వైసిపి మండల యూత్ నాయకులు మేకల వెంకటరెడ్డి, వైసిపి నాయకులు బాలగురువారెడ్డి, రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

మిర్చిసాగుపై అవగాహన

నాగులుప్పలపాడు : శనగ మిర్చి సాగు సస్యరక్షణ పద్దతులుపాటించి మంచి పలితాలు సాదించాలని శాస్త్రవేత్తలు వరప్రసాదరావు , రమేష్ తెలిపారు. మండల పరిధిలోని ఉప్పుగుండూరు రైతుభరోసా కేంద్రంలో రైతు సంఘం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రబీసాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు రైతు సంఘం జిల్లానాయకుడు జె. జయంతిబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పంటల సాగులో రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి ప్రత్యూష, రైతుసంఘం నాయకులు టి.శ్రీకాంత్, జి. బసవపున్నయ్య, రైతులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న ఎంసి చైర్మన్ దారపనేని

బంగారు కిరీటం కోసం విరాళాల సేకరణ

ప్రజాశక్తి-పామూరు

దాతల సహకారంలో అయ్యప్పస్వామికి బంగారు కిరీటం ఏర్పాటు చేసేందుకు విరాళాలు సేకరిస్తున్నారు. అందులో భాగంగా కనిగిరి ఎఎంసి చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ సౌజన్యంతో వారి మిత్రమండలి రూ. 56,276 నగదును విరాళంగా శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ గుత్తి వెంకటరాజా కావిటిసుబ్బయ్య, దేవస్థాన కమిటీ గౌరవాధ్యక్షుడు బైరెడ్డి జయరామిరెడ్డి, దాతలు పోక నాయుడుబాబు,నూతంగి వెంకటనారాయణ బ్రదర్స్, మిరియం సుబ్బరాయుడు, చెనికల మాలకొండయ్య, మోరబోయిన గిడ్డయ్య యాదవ్, తిరివీధి కేశవరావు, తిరివీధి రమణయ్య, దగ్గుమాటి హరీష్, ఎర్రసింగు మాలకొండ రాయుడు , గడ్డం వెంకటరత్నం, పోక రామకష్ణ పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

పాఠశాల గదుల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-పామూరు

నాడు- నేడు పథకం ద్వారా పాఠశాలలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను వేగంతంగా పూర్తి చేయాలని ఎంపిపి గంగసాని లక్ష్మీ తెలిపారు. స్థానిక గోపాలపురం ప్రాథమిక పాఠశాల రూ. 39 లక్షల అదనపు తరగతి గదుల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి చప్పిడి సుబ్బయ్య, పాఠశాల హెచ్‌ఎం. ముసలయ్య, సత్యనారాయణరెడ్డి, పామూరు ఉపసర్పంచి యాదాల వెంకటసాయి, వైస్ ఎంపిపి షేక్ రషీద్, ఖాదర్‌బాషా, నాయబ్‌రసూల్, రామిరెడ్డి, గోవిందయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

యర్రగొండపాలెం : విద్యార్థి దశ నుంచే రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ కోటయ్య తెలిపారు. యర్రగొండపాలెంలోని గౌతమి జూనియర్, డిగ్రీ కళాశాలలు, సాధన కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కోటయ్య మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ రోజురోజుకు పెరిగి పోతుందన్నారు. ఇటువంటి సమయంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ త్రిపురారెడ్డి, రవిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల చదువులపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-చీమకుర్తి

బాలికల చదువుపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని, వివాహాలపై కాదని జడ్‌పిటిసి వేమాశ్రీనివాసరావ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాల్యవివాహాల నిరోధక చట్టంపై జరిగిన అవగాహనా సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సదస్సుకు ఎంపిడిఒ వండర్‌మెన్ అధ్యక్షత వహించారు. వేమాశ్రీనివాసరావు మాట్లాడుతూ బాలికలు బాలుర కంటే అన్ని రంగాలలో ప్రతిభ చూపుతున్నారన్నారు. వారికి సరైన ప్రోత్సాహం అందిస్తే వారు ఎన్నో విజయాలు సాధిస్తారని ఆయన తెలిపారు. బాల్య వివాహాల నిరోధక చట్టంపై గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు కూడల అంజలీమాలకొండయ్య, ఇఒఆర్‌డి శ్రీనివాస్, ఐసిడిఎస్ అధికారులు, అంగనవాడీలు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

పర్యావరణాన్ని పరిరక్షించాలి : ఎమ్మెల్యే

గిద్దలూరు : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎమ్మెల్యే అన్నా రాంబాబు తెలిపారు. రెవెన్యూ కార్యాలయ ఆవరణంలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పుట్టిన రోజు నాడు రెండు మొక్కలు నాటి వాటిని పరిరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. ప్రజలు ఇంటి పరిసరాల్లో కూడా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, వైస్ చైర్మన్ ఆర్‌డి. రామకష్ణ, తహశీల్దారు రాజా రమేష్ ప్రేమ్ కుమార్, విఆర్‌ఒలు రంగయ్య, వెంకట రామయ్య, అచ్చయ్య, మహానంది, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : ఎంపిపి

దర్శి : క్రీడలతో మానసిక ఉల్లాసం పెరుగుతుందని ఎంపిపి గోళ్లపాటి సుధారాణి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ బాలబాలికలకు నియోజకవర్గ స్థాయిలో వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించున్నుట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కె. రఘురామయ్య, వైస్ ఎంపిపిలు సోము దుర్గారెడ్డి, కొరివి ముసలయ్య, షేక్ కార్పోరేషన్ డైరెక్టర్ డాక్టరు ఎస్‌ఎం.బాషా, గోళ్లపాటి అచ్చయ్య, పీడీలు సోము అంజిరెడ్డి, అనీల్, కొండలరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బడుగు వెంకటేశ్వర్లు

భూ సమస్యలు పరిష్కరించాలి : బడుగు

హనుమంతునిపాడు : మండల పరిధిలోని మంగంపల్లి దళితుల భూ సమస్యను పరిష్కరించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు బడుగు వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగంపల్లి దళిత పేటను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని భూమిలేని పేదలందరికీ పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల నాయకులు కత్తి ఏబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పోతురాజు, మంగయ్య, వేసుకోగు ప్రభాకర్ పాల్గొన్నారు.



కోటయ్యతో మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే ఉగ్ర

కోటయ్యను పరామర్శించిన 'ఉగ్ర'

హనుమంతునిపాడు : గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నల్లగడ్ల గ్రామానికి చెందిన నియోజకవర్గ ఎస్‌సిసెల్ అధ్యక్షుడు బలసాని కోటయ్యను మాజీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి శుక్రవారం పరామర్శించి, యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు ఉపాధ్యక్షుడు రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మురహరి నరసయ్య, కోటపాటి పెద్ద శేషయ్య, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షుడు ఎర్రయ్య పాల్గొన్నారు.

స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగర పరిధిలోని రెండో డివిజన్ కేశవరాజు కుంట నుంచి పోతురాజు కాలువ వరకూ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.86.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ నగరంలో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అందులో భాగంగా 15వ ఆర్థిక సంఘం నిధుల్లో ఎక్కువ భాగం నిధులు భారీ డ్రెయిన్‌ల నిర్మాణానికే కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, స్థానిక కార్పొరేటర్ తెల్లపల్లి ధనలక్ష్మి, కార్పొరేషన్ ఇంజినీర్ మాల్యాద్రి, డిఇ రఘురాం, వైసిపి నాయకులు రాయపాటి అంకయ్య, రాయపాటి వెంకటేశ్వర్లు, రాయపాటి అంజయ్య, పాటి బండ్ల సుల్తాన్ బాషా, రాయపాటి కోటిలింగం, కొమ్ము ఆశీర్వాదం, కొలకలూరి ప్రభుదాస్, పాలపర్తి కోటయ్య, రావినూతల మురళీకృష్ణ, రాయపాటి కృష్ణ పాల్గొన్నారు.

35వ డివిజన్‌లో పైపులైన్ నిర్మాణానికి శంకుస్థాపన

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాలకు కేటాయించిన నిధుల్లోంచి రూ.4లక్షలు వ్యయంతో 35వ డివిజన్‌లో నూతనంగా ఏర్పాటు చేయనున్న తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు నగర మేయర్ గంగాడ సుజాత శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఆదిపూడి గిరిజా శంకర్ శాండిల్యా, కార్పొరేషన్ డిఇ గణపతి, ఎఇ అంజిరెడ్డి, కాంట్రాక్టర్ వెంకట్రావు పాల్గొన్నారు.

26వ డివిజన్‌లో 'గడపగడపకూ'

26వ డివిజన్ పరిధిలోని పప్పుబజార్, అప్పలవారి వీధిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఇంటింటికీ తిరిగి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు , సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పరిశీలన

ఒంగోలు సబర్బన్ : ఒంగోలు మండలం కరవది గ్రామంలో జగనన్న కాలనీలో చేపట్టిన గృహ నిర్మాణాలను మండల హౌసింగ్ స్పెషల్ ఆఫీసర్, ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. గృహ నిర్మాణాలు వెంటనే పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం అధికారులు, లబ్ధిదారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

22న బాస్కెట్ బాల్ క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఉమ్మడి ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్ మరియు త్రో బాల్ క్రీడాకారుల ఎంపిక ఈనెల 22న నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి మసనం ఆదినారాయణరావు ఓ ప్రకటనలో తెలిపారు. కందుకూరు టిఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో అండర్-19 బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్, త్రో బాల్ ఎంపికలు బాలురు, బాలికలకు జరుగుతాయని తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొనేందకు 2004 జనవరి 1 తర్వాత జన్మించిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు టెన్త్ మార్కుల జాబితా, ఆధార్ కార్డు ఒరిజినల్‌తో ఈనెల 22న ఉదయం 9 గంటలకు హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రభుత్వ స్టేడియాలను కాపాడండి : డివైఎఫ్ఐ



మాట్లాడుతున్న కెఎఫ్.బాబు

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ స్టేడియాలను పే అండ్ ప్లే పేరుతో ప్రైవేటు కాంట్రాక్టర్లకు లీజుకు ఇవ్వాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉప సంహరించుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్. బాబు డిమాండ్ చేశారు. స్థానిక పివిఆర్ బాలుర ఉన్నత పాఠశాల మైదానం వద్ద శుక్రవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ స్టేడియాలను పే అండ్ ప్లే పేరుతో ప్రైవేట్ కాంట్రాక్టర్లకు లీజ్‌కు ఇవ్వాలని ప్రభుత్వం, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించిన టెండర్లకు అధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ నిర్ణయాన్ని డివైఎఫ్ఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్ష,కార్యదర్శులు పి.కిరణ్, వై.దానియేలు కార్యకర్తలు వికార్తిక్, ఎస్.సుబ్బారెడ్డి పాల్గొన్నారు

క్రీడలకు అధిక ప్రాధాన్యత

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



జగనన్న క్రీడలను ప్రారంభిస్తున్న మంత్రి సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో క్రీడా రంగానికి తగిన ప్రాధాన్యత కల్పించి, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జగనన్న ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. యర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో రాష్ట్రప్రభుత్వం, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగనన్న క్రీడా సంబరాలు-2022 నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించే దిశగా క్రీడా ప్రాధికార సంస్థ పని చేస్తుందని తెలిపారు. యువత చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తిని చూపాలన్నారు. జగనన్న క్రీడా సంబరాలలో కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలను నియోజకవర్గ, జిల్లా, జోన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 20, 21 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు రూ.50 లక్షల విలువైన బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యు ఎస్ ఎస్ఇ మర్ధన్ అలి, డిఎల్‌డిఒ సాయికుమార్, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్‌పిటిసిలు విజయభాస్కర్, వాగ్యా నాయక్, సర్పంచి రామావత్ అరుణాబాయి, ఎంపిడిఒ రామసుబ్బ రంగయ్య, తహశీల్దారు రవీంద్రారెడ్డి, ఎంఇఒలు ఆంజనేయులు, సామ్యూల్ జోబ్, నాయకులు సుబ్బారావు, పిచ్చయ్య పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలు అభివృద్ధికి నిరోధకాలు

జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు ఎవి.పుల్లారావు



ప్రశ్నా పత్రాలను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మూఢ నమ్మకాలు అభివృద్ధి నిరోధకాలని జన విజ్ఞానవేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు ఎవి. పుల్లారావు తెలిపారు. జనవిజ్ఞాన వేదిక, ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో సెయింట్ థెరిసా ఉన్నత పాఠశాలలో నగర స్థాయి చెకుముకి సైన్సు సంబరాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ మూఢనమ్మకాలు సమాజ ప్రగతికి నిరోధకాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూఢనమ్మకాల నిరోధక చట్టాలు రూపొందించి అమలు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సెయింట్ థెరిస్సా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.ఆనంద్ రావు మాట్లాడుతూ శ్రామికులు ,కర్షకులు ,శాస్త్రవేత్తల పట్ల విద్యార్థులు గౌరవభావం కలిగి ఉండాలన్నారు. దైనందిన జీవితంలో క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. జెవివి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.తిరుపతయ్య మాట్లాడుతూ విద్యార్థులు తార్కిక ఆలోచన ,హేతువాద దక్పథం కలిగి ఉండాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు డిఎల్ .ప్రసాద్, నగర కమిటీ ప్రధాన కార్యదర్శి టి .రమణ, జివి.చలమారావు ,ఎస్‌కె. మాలిక్ తదితరులు విద్యార్థు లను ఉత్తేజ పరుస్తూ చదువు ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఉద్యమ గీతాలను ఆలపించారు. సైన్స్ టెస్ట్‌కు నగర పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల నుంచి 25 టీంలు పాల్గొన్నాయి. ప్రైవేటు పాఠశాలల విభాగంలో మాంటిస్సోరి ఉన్నత పాఠశాల విద్యార్థినులు మొదటి స్థానం సాధించారు. డిసెంబర్ 11న పొదిలిలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సైన్స్ టెస్ట్‌లో వీరు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి టి .రమణ, శ్రీనివాస్, నారాయణ , టి. సాంబశివరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

22న ధర్నాను జయప్రదం చేయండి : యుటిఎఫ్

డిఆర్ఒకు సమ్మె నోటీసు అందజేత



డిఆర్ఒకు సమ్మె నోటీసు అందజేస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన పిఎఫ్, ఎపి జిఎల్ఐ, డిఎ అరియర్స్, సరెండర్ లీవులు, మెడికల్ రీయింబర్స్ మెంట్ తదితర డిమాండ్లపై ఈనెల 22న నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఒవి.వీరారెడ్డి, ఎస్. రవి కోరారు. జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసుకు శుక్రవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఎఫ్ బకాయిలు 9నెలలుగా పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. మిగిలివన్ని బకాయిలు సంవత్సర కాలంగా పెడింగ్‌లో ఉన్నాయన్నారు. రాష్ట్ర మంత్రులు ఆర్థిక పరిస్థితికి ఎలాంటి ఢోకాలేదని, ఆర్థికంగా పురోగమిస్తున్నామని చెబుతున్నప్పటికీ ఉద్యోగ, ఉపాధ్యాయుల జీతాలు కూడా సకాలంలో చెల్లించలేని పరిస్థితి ఉందన్నారు. వివాహాలు, ఆసుపత్రుల ఖర్చులు, అత్యవసర సందర్భాలకు పిఎఫ్, ఎపిజిఎల్ఐ లోన్లకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ సకాలంలో చెల్లించక పోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారన్నారు. సిపిఎస్ ఉద్యోగులకు సిఎ అరియర్స్, ఇన్ కంటాక్స్ చెల్లించినప్పటికీ ఇప్పటి వరకు వారి ఖాతాలలో జమ కాలేదన్నారు. పిఆర్‌సి చర్చలలో ముఖ్యమంత్రి ఆర్థిక బకాయిలు సకాలంలో చెల్లిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ లేవన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఇబ్బందులు గుర్తించి దశల వారీగా బకాయిలు చెల్లించమని పలుమార్లు ప్రాతినిధ్యం చేసినా, ఫలితం లేదని తెలిపారు. ఈ పరిస్థితులలో ఆర్థిక బకాయిల చెల్లింపు కోసం ఆందోళన బాట పట్టాలని ఎపి యుటిఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద ఈనెల 22న ధర్నా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్స్ వేలాది సంఖ్యలో పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని వారు కోరారు.